ఎంబీబీఎస్ యాజమాన్య సీట్ల రెండో విడత కౌన్సెలింగ్

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీబీఎస్ యాజమాన్య కోటా సీట్ల భర్తీకి రెండో విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రకటన విడుదల చేసింది. సోమవారం రాత్రి 10 గంటల నుంచి రెండో తేదీ రాత్రి 9 గంటల వరకు ఆప్షన్లు ఇచ్చుకోవాలి. రాష్ట్రంలోని 6 ప్రభుత్వ కళాశాలల్లోని సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లలో 'బి' కేటగిరీలో 32, ఎన్నారై కోటా కింద 15 సీట్లు, 17 ప్రైవేటు వైద్య కళాశాలల్లో బి1 కేటగిరీలో 77, బి2 కేటగిరీలో 117, సి కేటగిరీలో 110 సీట్లు ఉన్నాయి. మైనారిటీ వైద్య కళాశాలల్లో బి కేటగిరీలో 30, సి కేటగిరీలో 29 సీట్లను రెండో విడత కౌన్సెలింగ్‌కు అందుబాటులో ఉంచారు.

శరన్నవరాత్రి మహోత్సవాలకు ఆహ్వానం



ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల సన్నిధిలో నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు.. మంత్రి లోకేశ్‌లను దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆహ్వానించారు. ఈవో రామారావు, వేదపండితులు పాల్గొన్నారు. - ఈనాడు, అమరావతి

ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలో సెక్షన్ 30 అమలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలో సెక్షన్ 30, పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నిషేధాజ్ఞలు విధిస్తున్నట్లు పోలీస్ కమిషనర్, మెట్రోపాలిటన్ ప్రాంత అదనపు జిల్లా మేజిస్ట్రేట్ ఎస్.వి.రాజశేఖరబాబు తెలిపారు. అక్టోబరు 1 నుంచి డిసెంబరు 31వ తేదీ వరకు మొత్తం 92 రోజుల పాటు ఈ సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. పోలీసు శాఖ నుంచి ముందస్తు అనుమతులు తీసుకోకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు, నిరసనలు, ధర్నాలు నిర్వహించకూడదు. నిషేధాజ్ఞలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.


మాకు లేదా పరిహారం?

- అర్జీల మీద అర్జీలు ఇస్తున్న నగరవాసులు
- అనర్హులని తెలిసీ దరఖాస్తుల అందజేత
- రికార్డు స్థాయిలో రూ.173.69 కోట్లు జమ

ఈనాడు - అమరావతి

'అయ్యా.. నా ఇల్లు వరదలో మునిగింది. నేను సర్వం కోల్పోయా. అయినా నాకు పరిహారం రాలేదు. దయచేసి నాకు సాయం అందించండి..!' అని విజ్ఞాపన..! ఒకటి కాదు.. రెండు కాదు.. ఒక్క రోజే దాదాపు 2 వేల మంది విజ్ఞాపనలు అందించారు. ఇలా ప్రతి రోజూ కలెక్టరేట్‌కు వందల సంఖ్యలో విజ్ఞాపనలు వస్తున్నాయి. ఇచ్చిన వారే మళ్లీ మళ్లీ దరఖాస్తు చేస్తుండడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. విచారణ పేరుతో తిరిగిన ప్రాంతాలే మళ్లీ మళ్లీ తిరుగుతున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా నగరాన్ని వరద ముంచెత్తింది. ప్రభుత్వం స్పందించి పరిహారం కూడా భారీగా ప్రకటించింది. వంద శాతం రెట్టింపు చేసింది."

"గత నెల 25న సీఎం చంద్రబాబు పరిహారం విడుదల చేశారు." రెండో రోజు నుంచే లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ అయింది. రాష్ట్ర ప్రభుత్వం రికార్డు స్థాయిలో ఇప్పటికే మొత్తం రూ.173.69 కోట్లను జమ చేసింది. ఇంకా 15 వేల ఖాతాలు వివిధ సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బ్యాంకు ఖాతాలు పనిచేయనివిగా మూతపడ్డాయి. వీటిని తిరిగి బ్యాంకులో లబ్ధిదారులతో తెరిపించాలి. దీనికి లబ్ధిదారుల నుంచి సహకారం లేకపోగా తమకేం సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తూ.. తమకు పరిహారం పడలేదని సమాధానం ఇస్తున్నారని అధికారులు వాపోతున్నారు. బ్యాంకు ఖాతా పనిచేయడం లేదు సరిచూసుకోగలరని చెబుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. మరోవైపు కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు అందిస్తున్నారు."



దరఖాస్తులను తీసుకోవడానికి ఏర్పాటు చేసిన స్టాళ్లు

ముంపునకు గురైన ఇళ్లు (మొదటి సర్వే)	78,558
ఇప్పటి వరకు పరిహారం జమ	75,427
అందించిన సొమ్ము (రూ.కోట్లలో)	160.47
అర్హులుగా గుర్తించిన వారు	8,000 మంది
బ్యాంకు ఖాతా సమస్యలు ఉన్నవారు	15,000
అన్ని రకాల ఖాతాలు	1,09,729
ఇచ్చిన పరిహారం (రూ.కోట్లలో)	173.69
సోమవారం అందిన ఫిర్యాదులు	2,000



దరఖాస్తు పత్రాలు నింపుతూ...

అసలేం జరుగుతోంది..!

తమ ఇళ్లకు ఎన్యుమరేషన్ కోసం బృందాలు రాలేదని కొందరు ధర్నా చేశారు. నిబంధనల ప్రకారం ఒక్కరోజు మాత్రమే ముంపులో ఉంటే పరిహారం రాదని ప్రభుత్వం స్పష్టంగా జీవోలో పేర్కొంది. అలాంటి డివిజన్లలో ఎన్యుమరేషన్ జరగలేదు. ఒకటో పట్టణం రావిచెట్టు సెంటర్‌లో ఇళ్లు నీట మునగలేదు. కానీ మునిగినట్లు కొందరు దరఖాస్తులు ఇస్తున్నారు. వీటిని అధికారులు పక్కన పెట్టినా.. పరిహారం రాలేదని అర్జీలు అందిస్తున్నారు. ఒక ఇంటికి ఒక కుటుంబానికి మాత్రమే పరిహారం అందిస్తున్నారు. అయితే ఒకే పోర్షన్‌లో మూడు కుటుంబాలు ఉంటున్నట్లు అర్జీలు ఇస్తున్నారు. తాము వేర్వేరు అని దరఖాస్తులు చేస్తున్నారు. వీటిపై విచారణ జరిపి ధ్రువీకరిస్తున్నా.. మళ్లీ మళ్లీ అర్జీలు అందుతూనే ఉన్నాయి. ఇలాంటి దరఖాస్తులు కలెక్టరేట్‌కు 15వేల వరకు అందాయి. వాస్తవానికి సంబంధిత సచివాలయంలో దరఖాస్తు ఇస్తే.. పరిశీలించి ఎందుకు పరిహారం అర్హులు కాదో తేల్చి చెబుతున్నారు. అయినా కలెక్టరేట్‌కు వేల సంఖ్యలో వస్తున్నారు.

పరిహారం అధికంగా ఉండడమే..!

వరద బాధితులకు ప్రభుత్వం ఉదారంగా.. పరిహారం అధికంగా ఇవ్వడమే కారణమని చెబుతున్నారు. పూర్తిగా మునిగిన ఇంటికి రూ.25 వేలు, మొదటిఫ్లోర్‌కు రూ.10 వేలతో పాటు వాహనాలకు. తోపుడు బండ్లకు పరిహారం ఇస్తోంది. దీనిని దక్కించుకునేందుకు అధికంగా బోగస్ దరఖాస్తులు వస్తున్నాయి. కొందరు రెచ్చగొట్టి తెస్తున్నారని ఇంటిలిజెన్స్ వర్గాలు ప్రభుత్వానికి నివేదించాయి. దీనిలో మీడియా పాత్ర కూడా ఉందని వారు నివేదించారు. దీనిపై కలెక్టర్ జిసృజన స్పందిస్తూ.. వరద బాధితులు ఇచ్చిన అర్జీలపై క్షేత్ర పరిశీలన జరిపి వాస్తవం ఉంటే.. అర్హులైతే పరిహారం అందిస్తున్నామన్నారు. కానీ ఇచ్చిన వారే అర్జీలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 15 వేల వరకు బ్యాంకు ఖాతాలు స్తంభించడంతో పరిహారం జమ కాలేదని వివరించారు. అన్నింటిపై చర్యలు తీసుకుంటామనీ.. నిబంధనలకు విరుద్ధంగా ఏఒక్కరికీ పరిహారం ఇవ్వబోమని హెచ్చరించారు.

ఉత్సవ శోభ



న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి

దసరా ఉత్సవాలు దగ్గర పడుతున్న తరుణంలో అధికారులు ఏర్పాట్లు శరవేగంగా చేస్తున్నారు. దుర్గాఘాట్ సమీపంలో గతేడాది కొండరాళ్లు జారిపడ్డాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని రోడ్డును సగం వరకు మూసివేస్తూ గడ్డర్లను ఏర్పాటు చేశారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో దేవస్థానం అధికారులు జాతీయ రహదారిపై మధ్య క్యూలైనుకు ఏర్పాటు చేశారు. అపరిశుభ్రంగా ఉన్న ఈ ప్రాంతాన్ని శుభ్రం చేసి ఈసారి గడ్డర్లు ట్రాఫిక్‌కు ఆటంకం లేకుండా ఏర్పాటు చేస్తున్నారు. కుమ్మరిపాలెం సెంటరు వైపు నుంచి వచ్చే భక్తులకు ప్రత్యేకంగా క్యూలైను ఏర్పాటు చేశారు. ద్విచక్ర వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండా ఉండేందుకు ఫుట్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు.

అదనంగా సిద్ధం..

ఉత్సవాల నేపథ్యంలో దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులు సుమారు ఏడు లక్షలు ఉంటారని దేవస్థానం అధికారులు అంచనా వేశారు. వారిని దృష్టిలో పెట్టుకొని 15 లక్షల లడ్డూ ప్రసాదాన్ని సిద్ధం చేయనున్నారు. అందుకు అవసరమైన పొయ్యిలు ప్రసాదాల పోటులో యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేస్తున్నారు. నిత్యం ప్రసాదాల తయారీకి వినియోగించే వాటికి అదనంగా 30 పొయ్యిలు సిద్ధం చేస్తున్నారు. వీటిని తరలించేందుకు ప్రసాదాల పోటు రెండో ఎగ్జిట్‌కు అడ్డుగా ఉన్న నేతి డబ్బాలను తొలగించారు. ప్రసాదాలు ఆలయ ప్రాంగణానికి తరలించే వాహనాలు, సిబ్బంది కోసం కొంత ఖాళీ స్థలాన్ని కూడా వదిలారు.

తుది దశకు చేరాయి

ఉత్సవాలు ప్రారంభం కావడానికి కొద్దిరోజులే సమయం ఉండటంతో ఘాట్ రోడ్డు రక్షణ గోడ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఆ రహదారిలో క్యూలైన్లు ఇప్పటికే మొదటి మలుపు వరకు పూర్తి చేశారు. కెనాల్ రోడ్డు వినాయకుడి గుడి నుంచి దుర్గగుడి టోల్‌గేటు క్యూలైను నిర్మాణం పూర్తయ్యింది. రక్షణ గోడ పూర్తైన వెంటనే టోల్‌గేటు నుంచి గోడ వరకు పది గంటల్లో లైన్ల ఏర్పాటు పూర్తి చేస్తామని దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.



సిద్ధంగా ప్రసాదం కౌంటర్లు

మల్లేశ్వర ఆలయం సమీపంలో ఐరన్ మెట్లు

ఘాట్‌రోడ్డు మార్గంలో దర్శనం చేసుకున్న భక్తులు మల్లేశ్వరాలయ మెట్లు, మల్లికార్జున మహా మండపం ర్యాంపు ద్వారా బయటకు వస్తారు. గతంలో అత్యవసర సమయంలో మాత్రమే ఈ మార్గాన్ని వినియోగించేవారు. అధిక శాతం భక్తులు మల్లేశ్వరాలయ మెట్ల మార్గం నుంచి కనకదుర్గానగర్ ప్రసాదాల కౌంటర్లకు చేరే వారు. ఈసారి కనకదుర్గానగర్‌లో ఎలివేటెడ్ క్యూలైన్లు, ప్రసాదాల పోటు, అన్నదాన భవన నిర్మాణ పనులు జరుగుతుండటంతో ప్రత్యామ్నాయంగా మల్లేశ్వరాలయం సమీపంలో ఐరన్ మెట్లు ఏర్పాటు చేశారు. దీంతో పాటు కొత్త ర్యాంపు, స్థానిక భక్తులు పాత మెట్ల మార్గం ద్వారా నేరుగా బ్రాహ్మణ వీధిలోకి చేరేందుకు వీలుంటుందని భావించి వినియోగంలోకి తీసుకొస్తున్నారు. గతంలో ఒక ఎంట్రీ, ఒక ఎగ్జిట్ మాత్రమే ఉండేది. ప్రస్తుతం అభివృద్ధి పనులు జరుగుతుండటంతో అదనంగా మూడు ఎగ్జిట్లు ఏర్పాటు చేస్తున్నందున భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని ఈవో రామారావు తెలిపారు.



భక్తుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్ బ్రిడ్జి

డ్రోన్లతో ప్రత్యక్ష ప్రసారం

భక్తుల రద్దీ, ట్రాఫిక్ నియంత్రణకు వినియోగం



ఈనాడు - అమరావతి: అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలకు పోలీసు శాఖ సన్నద్ధమవుతోంది. ఈసారి భక్తుల సంఖ్య భారీగా ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సాధారణ రోజుల్లో లక్ష, మూలా నక్షత్రం రోజు దాదాపు 2.5 లక్షల మంది వరకు వివిధ ప్రాంతాల నుంచి తరలిరానున్నారని అధికారులు లెక్కలు వేస్తున్నారు. ఈ రద్దీకి తగ్గట్లుగా పోలీసు శాఖ కూడా ఏర్పాట్లు చేస్తోంది. ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు వీలున్న మూడు డ్రోన్లను నగర పోలీసులు సమకూర్చుకున్నారు. పాత వాటికి తోడు వీటిని కూడా ఉపయోగించనున్నారు. క్యూలైన్లలో భక్తుల రద్దీ, ఆలయ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్, తదితర వాటిని ఎప్పటికప్పుడు లైవ్ స్ట్రీమింగ్ ద్వారా పరిశీలించి నిర్ణయాలు తీసుకునేందుకు వినియోగించనున్నారు. వినాయక గుడి, మోడల్ అతిథి గృహం, అమ్మవారి ఆలయం, తదితర ప్రాంతాల్లో వీటిని మోహరించనున్నారు. వీటి నుంచి వచ్చే దృశ్యాలను మోడల్ అతిథిగృహంలోని కంట్రోల్ రూమ్, లబ్బీపేటలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానిస్తారు. వీటి నుంచి వచ్చే దృశ్యాలను పోలీసు ఉన్నతాధికారుల మొబైళ్లకు కూడా లింక్ ద్వారా వెళ్తాయి. తమ ఫోన్లలోనే ఎప్పటికప్పుడు రద్దీని చూస్తూ.. పరిస్థితులకు తగ్గట్లు నిర్ణయాలు తీసుకునేందుకు వెసులుబాటు ఉంది.

మల్లవల్లిలో మొదలెట్టారు!

- విలువైన సున్నపురాయి దోపిడీ
- రూ.కోట్లలో పన్నుల ఎగవేత...

"రాష్ట్రంలో ప్రభుత్వం మారినా.. అక్రమార్కుల తీరు.. అధికారుల వైఖరి మారలేదు. స్వయంగా గనులు, భూగర్భ గనుల శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోనే అక్రమ తవ్వకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. వైకాపా ప్రభుత్వంలో అధికారులు చూస్తుండగానే గ్రావెల్ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగాయి. కొందరు అధికారులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. పోలీసులు సైతం ఆ ఫిర్యాదులను బుట్టదాఖలు చేశారు. ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయలేదు."



"తాజాగా సున్నపురాయి అక్రమ తవ్వకాలు జరుగుతున్నా.. అధికారులు కళ్లు మూసుకున్నారు. బాపులపాడు మండలం మల్లవల్లి సమీపంలో ప్రభుత్వ భూముల్లో రూ.కోట్ల విలువైన సున్నపురాయి (క్వార్ట్జ్ రాయి) అక్రమంగా తరలిపోతోంది. దీనిపై ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. గత కొంతకాలంగా పదుల ఎకరాల్లో తవ్వకాలు జరిగాయి. రూ.కోట్ల విలువైన ఖనిజ సంపద దోచేశారు. నూజివీడు ప్రాంత వ్యాపారులు కొందరు దీనిని తరలిస్తున్నట్లు తెలిసింది."

ఈనాడు - అమరావతి

బాపులపాడు మండలం మల్లవల్లిలో కొన్ని భూముల్లో సున్నపురాయి నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించారు. ఈవిషయాన్ని గుట్టుగా ఉంచారు. పాత మల్లవల్లి పరిధిలో ప్రభుత్వ భూముల్లో.. సర్వే నంబర్లు 165, 166 పరిధిలో దాదాపు 12 ఎకరాల్లో ఈ సున్నపురాయి ఉంది. వాస్తవానికి దీనికి లీజులు తీసుకుని తవ్వకాలు చేపట్టాలి. కానీ ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు వ్యాపారులు రాత్రికి రాత్రే తవ్వి అక్రమంగా రవాణా చేస్తున్నారు. లారీలు, టిప్పర్లలో... సున్నపురాయి వేసి పైన గ్రావెల్ నింపి రవాణా చేస్తున్నారని తెలిసింది. పోలీసులు గుర్తించినా గ్రావెల్ పంపుతున్నట్లు మభ్యపెడుతున్నారు. ఎంతో కొంత ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. ఈ సున్నపురాయిని నూజివీడు ప్రాంతానికి తరలించి అక్కడ పిండి చేస్తున్నట్లు తెలిసింది. కొంత చెన్నైకు ఎగుమతి చేస్తున్నట్లు సమాచారం.

రెండు నెలలుగా తవ్వడమే...

గతంలో ఎ.కొండూరు మండలంలో అటవీ ప్రాంతంలో ఓ మాజీ మంత్రి బంధువు విచ్చలవిడిగా తవ్వి చెన్నైకు ఎగుమతి చేశారు. గాజు పరిశ్రమల్లో విరివిగా దీనిని వినియోగిస్తారు. గత రెండు నెలలుగా గుట్టుచప్పుడు కాకుండా పొక్లయిన్లు పెట్టి తవ్వుతున్నా.. స్థానిక అధికారులు తమకు సమాచారం లేదని చెబుతున్నారు. గనులు, భూగర్భ గనుల శాఖ మంత్రిగా జిల్లాకు చెందిన కొల్లు రవీంద్ర బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన జిల్లాలోనే రాత్రికి రాత్రే ఈతవ్వకాలు జరుగుతున్నాయంటే... అధికారుల పాత్ర ఏమేరకు ఉందనేది అర్థమవుతోంది.

ఖజానాకు రూ.కోట్లు నష్టం..!

క్వార్ట్జ్ రాయి.. ఒక ఘనపు మీటరుకు సీనరేజీ కింద గనుల శాఖకు రూ.110 చెల్లించాలి. జిల్లా మైనింగ్ ఫండ్ (డీఎంఎఫ్), మెరిట్ ఛార్జీలు, కన్సిడరేషన్ ఛార్జీలు అన్నీ కలిపి రూ.300 వరకు చెల్లించాలి. ఆ ప్రకారం ఒక ఎకరాలో తవ్విన రాయికి రూ.కోట్లలో ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. అక్కడ మొత్తం 12 ఎకరాల్లో తవ్వుతున్నారు. ఈ రాయి మార్కెట్‌లో క్వాలిటీ మేరకు.. టన్ను ధర రూ.2,000-5,000 ఉంది. మల్లవల్లిలో లభించే క్వార్ట్జ్ రాయి క్వాలిటీ మధ్యతరహాలో ఉంది. దాదాపు రూ.3 వేల వరకు టన్ను ధర పలుకుతుంది. ఇప్పటికే కొన్ని వందల టన్నుల రాయి తరలించారని తెలిసింది. ఇంకా తవ్వుతూనే ఉన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో విలువైన గనులు అరుదుగా ఉన్నాయి. కంకర రాయి మినహా ఎలాంటి భూగర్భ నిక్షేపాలు లేవు. ప్రస్తుతం క్వార్ట్జ్ రాయి వెలుగు చూసింది. దీనిపై ఆదాయం రాకుండా అక్రమార్కులు తవ్వేస్తున్నారు. ఈ తవ్వకాలపై తమకు సమాచారం లేదని అధికారులు చెబుతుండటం గమనార్హం.





భళారే.. నృత్యోత్సవం

సిద్ధార్థ అకాడమీ, ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన నృత్యోత్సవంలో విద్యార్థినులు ప్రదర్శించిన నాట్యం ఆకట్టుకుంది. - ఈనాడు, అమరావతి

గల్లంతయినా... గమ్మునుంటారేం?!



ఇక్కడ నుంచే తల్లి.. ఇద్దరు పిల్లలతో దూకిందని చూపిస్తున్న స్థానికుడు

కాలువలపై నిర్మించిన వంతెనలు, కల్వర్టుల పైనుంచి ఎలాంటి వస్తువులు అందులో వేయకుండా, ఎవరూ అందులో దూకడానికి వీలులేకుండా రక్షణగా కంచెలు ఏర్పాటు చేస్తున్నారు. కానీ... జాతీయ రహదారిపై స్క్రూబ్రిడ్జి దగ్గర ఉన్న బందరు కాలువపై వంతెన రెయిలింగ్ ప్రమాదకరంగా ఉన్నా పట్టించుకోలేదు. ఆదివారం ఓ వివాహిత క్షణికావేశంలో తన ఇద్దరు పిల్లలను ఈ రెయిలింగ్ ఖాళీల నుంచి కాలువలో నెట్టేసి తాను కూడా దూకేసింది. ఓ చిన్నారి ప్రాణాలు కోల్పోగా.. మరో బిడ్డ, తల్లి ఆచూకీ తెలియలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈవంతెనపై రెయిలింగ్‌లో ప్రమాదకర ఖాళీలు పూరించి, ఎత్తు పెంచి.. ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలి. కోల్‌కతా-చెన్నై 16వ నంబరు జాతీయ రహదారిపై స్క్రూబ్రిడ్జి వద్ద కనిపించిన చిత్రమిది. - ఈనాడు - అమరావతి

డ్రాగన్ ఫ్రూట్ సాగుకు మొగ్గు

చందర్లపాడు, న్యూస్‌టుడే

సంప్రదాయ పంటలు సాగు చేసి నష్టాలు చవిచూసిన కొందరు రైతులు డ్రాగన్ ఫ్రూట్ వైపు దృష్టి సారిస్తున్నారు. చందర్లపాడు, ముప్పాళ్ల, గుడిమెట్ల, చింతలపాడు తదితర ప్రాంతాల అన్నదాతలు మంచి పోషకాలతో కూడిన, మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న.. డ్రాగన్ ఫ్రూట్ పండించేందుకు మొగ్గు చూపుతున్నారు. అందులో ఒకరు చందర్లపాడు గ్రామానికి చెందిన రైతు తమ్మినేని రామయ్య. గతేడాది ఎకరన్నర పొలంలో సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. పొలంలో బావి ఉన్నప్పటికీ నీటి సమస్య తలెత్తకుండా బోరు వేయించారు. సిమెంటు స్తంభాలు పాతి వాటిపై టైర్లు అమర్చారు. పొలం చుట్టూ కంచె ఏర్పాటు చేయించారు. పల్నాడు జిల్లా వేమవరం నుంచి ఒక్కో మొక్క రూ.60 కొనుగోలు చేసి నాటారు. బిందు సేద్యం ద్వారా నీరందిస్తున్నారు. రూ.10 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. ఎనిమిది నెలలకు దిగుబడి ప్రారంభమైంది. పండ్లను పొలం వద్ద, ఆటోలో గ్రామాలకు తీసుకెళ్లి కిలో రూ. 150-రూ.200కు విక్రయిస్తున్నారు. ఇప్పటివరకు 900 కిలోల పండ్లు కోశారు. మూడేళ్లలో పెట్టిన పెట్టుబడి చేతికి వస్తుందని, తర్వాత కొన్నేళ్ల వరకు నికర ఆదాయం పొందవచ్చని అభిప్రాయపడ్డారు. వాణిజ్య పంటలు వేసి ఆర్థికంగా నష్టపోవడం కన్నా... డ్రాగన్‌ఫ్రూట్ ఒకసారి సాగు చేస్తే కొన్నేళ్ల వరకు రాబడి పొందవచ్చని వివరించారు.



చందర్లపాడులో పండ్ల తోట

రైతేరాజు

మార్కెటింగ్ సమస్యతో సతమతం



దిగుబడి బాగానే ఉంది. విక్రయించడానికి మార్కెట్ సమస్య ఉంది. సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లి తక్కువ ధరకు అమ్మడం ఇష్టం లేదు. అందుకే ఆటోలో తీసుకెళ్లి చుట్టుపక్కల గ్రామాల్లో విక్రయిస్తున్నా. ప్రారంభంలో తోట దగ్గరికే వచ్చి కిలో రూ.200 చొప్పున కొనుగోలు చేశారు. దిగుబడి పెరగడంతో కిలో రూ.150కు విక్రయించా. ప్రస్తుతం రూ.180-రూ.200 వరకు ధర పలుకుతోంది. మార్కెట్ సమస్యను అధికారులు పరిష్కరిస్తే బాగుంటుంది.

- తమ్మినేని రామయ్య, రైతు, చందర్లపాడు

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

ప్రశ్న: పొద చిక్కుడు రకం, విత్తన మోతాదు, విత్తే సమయం, ఎరువుల యాజమాన్యం గురించి వివరించండి?

– కె. శ్రీనివాసరావు, ఘంటసాల

సమాధానం: పొద చిక్కుడు అర్కజయ రకం 50-60 రోజులకు కోతకు వస్తుంది. కాయలు ముదురు ఆకుపచ్చ రంగులో ఉంటాయి. ఎకరానికి 4-8 టన్నులు దిగుబడి వస్తుంది. పొద రకానికి ఎకరానికి 16 కిలోల విత్తనాలు సరిపోతాయి. అక్టోబరులో విత్తుకోవచ్చు. పశువుల ఎరువు ఎకరానికి 8-10 టన్నులు విత్తడానికి వారం ముందు ఆఖరి దుక్కిలో వేసి దున్నాలి. ఎకరానికి 24 కిలోల భాస్వరం, 12 కిలోల పొటాష్‌తో పాటు మొదటిసారి 15 కిలోల నత్రజని వేయాలి. రెండో సారి 15 కిలోల నత్రజని విత్తిన 30 రోజులకు వేయాలి. ఎరువులు వేసిన వెంటనే నీరు కట్టాలి.

- వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం – ఘంటసాల, న్యూస్‌టుడే



అరటి తోటలు కాపాడుకుందాం

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే

తుపానుల సమయంలో ఈదురుగాలులు అరటి తోటలకు ముప్పు తెచ్చిపెడుతున్నాయి. కొద్దిపాటి మెలవకులతో తోటలను కాపాడుకొనే విధానాలను ఉద్యాన శాఖ అధికారి జోసఫ్ చందు వివరించారు. మూడు నుంచి నాలుగు మాసాల మొక్కల మొదళ్లకు మట్టి ఎగదోస్తే బలంగా ఎదిగి గాలులకు తట్టుకుంటుంది. కర్పూర, చక్కెరకేళి మొక్కలు రెండున్నర నుంచి మూడు మీటర్ల ఎత్తు పెరుగుతాయి. కర్పూర మొక్కలు 15 నుంచి 18 కిలోలు, చక్కెరకేళి మొక్కలు 6 నుంచి 8 కిలోల బరువు గెలలు వేస్తాయి. అధిక గాలుల నుంచి రక్షణకు వెదురు బొంగులు పాతి ఊతం ఇవ్వాలి. మొక్క నుంచి గెల బయటకు వచ్చిన 10 నుంచి 15 రోజుల్లో ఊతమిస్తే మేలు. అధిక దిగుబడినిచ్చే వంగడాలు, భారీగా ఎదిగిన గెలలను కాపాడుకునేందుకు రెండు బొంగులను ఊతంగా పెడితే మంచిది. తుపాను హెచ్చరికలను ముందుగా గుర్తిస్తే పక్వానికి వచ్చిన గెలలు కోసి విక్రయించుకుంటే నష్టాల నుంచి గట్టెక్కవచ్చు. పక్షుల నుంచి రక్షణకు గెలలకు ఆకులు చుట్టడం, కవర్లు తొడగడం ఉత్తమం. ఎకరాకు వెయ్యి బొంగులు అవసరం ఉంటుంది.



లేగ దూడలు.. సంరక్షణ

లేగ దూడలు ఆరోగ్యంగా ఉండాలంటే పుట్టిన వెంటనే పాడి రైతులు కొన్ని జాగ్రత్తలు పాటించాలని గంపలగూడెం మండలం నెమలి పశువైద్యాధికారి డి.అభిలాష్ సూచించారు. ఆగస్టు నుంచి అక్టోబరు వరకు ఆవులు, గేదెలు ఈనే కాలం. వర్షాకాలంలోనే పాడి పశువులు దూడలకు జన్మనిస్తాయి. దూడలు పుట్టిన వెంటనే నోటి నుంచి, ముక్కు రంధ్రాల నుంచి వచ్చే జిగురు పొరలను శుభ్రంగా తొలగించాలి. దూడ పుట్టిన గంట లోపు జున్నుపాలు పట్టిస్తే రోగనిరోధకశక్తి పెరుగుతుంది. ధనుర్వాతం రాకుండా టీటీ ఇంజక్షన్ చేయించాలి. కొన్ని దూడలకు శ్వాసక్రియ సమస్య రావచ్చు. అటువంటి దూడల హృదయ భాగాన్ని బలంగా ఒత్తడం ద్వారా శ్వాసప్రక్రియ యథావిధిగా జరిగేలా చేయవచ్చు. పుట్టిన వెంటనే దూడ శరీరానికి రెండు అంగుళాల దూరంలో బొడ్డును నూలు దారంతో కట్టి కత్తిరించాలి. అనంతరం అయోడిన్ పూస్తే యాంటీసెప్టిక్‌గా పని చేసి గాయం త్వరగా మానుతుంది. రోగనిరోధకశక్తి పెంచడానికి వారం రోజులకు విటమిన్-ఏ ఇంజక్షన్ చేయించాలి.

– గంపలగూడెం, న్యూస్‌టుడే

ఆస్తి రాసిచ్చినా ఆదరించలా..!

అది విజయవాడలోని ఎన్టీఆర్ కలెక్టరేట్. సోమవారం ఉదయం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం జరుగుతోంది. ప్రాంగణం అంతా ప్రజలతో రద్దీగా ఉంది. రయ్‌రయ్ మంటూ.. ఓ అంబులెన్స్ వచ్చింది. ఆసుపత్రికి వెళ్లాల్సిన వాహనం.. ఇక్కడికి వచ్చిందేంటి..? అని అందరూ ఆసక్తిగా చూశారు. ఆరా తీస్తే.. అందులో వచ్చిన వృద్ధురాలు జగ్గయ్యపేట మండలం గుండబోయినపాలేనికి చెందిన నాగేంద్రమ్మ. క్యాన్సర్ బారిన పడ్డారు. పెరాలసిస్, ఉదర సంబంధ సమస్యలతో బాధపడుతున్నారు. జీవిత చరమాంకంలో మేనకోడలు తనకు అండగా ఉంటూ, బాగా చూసుకుంటుందని ఎకరా భూమి రాసిచ్చారు. తర్వాత నుంచి తనను చూడడం లేదని వాపోతున్నారు. ఈ విషయాన్ని గ్రామ పెద్దలు, పోలీసులకు చెప్పినా ప్రయోజనం లేకుండా పోయింది. భూమిని తిరిగి ఇవ్వకపోగా తనపైనే దాడి చేశారని.. న్యాయం చేయాలని కోరుతూ సోమవారం ఆమె విజయవాడ కలెక్టరేట్‌లోని ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అధికారులకు వినతిపత్రం అందించారు.



వాహనంలో స్ట్రెచర్‌పై నాగేంద్రమ్మ



కలెక్టరేట్ ఆవరణలో అంబులెన్స్

- ఈనాడు, అమరావతి

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 94 అర్జీలు

కృష్ణలంక, న్యూస్‌టుడే: కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ జి.సృజన నేతృత్వంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 94 అర్జీలు వచ్చాయి. వాటిలో రెవెన్యూకు సంబంధించి 37, పోలీస్-14, ఎంఎయూడీ-14, పంచాయతీరాజ్-6, సర్వే-1, కోఆపరేటివ్-1, ఆరోగ్యం-1, సాంఘిక సంక్షేమం-3, పౌర సరఫరాలు-3, బ్యాంకింగ్-2, మైన్స్ అండ్ జియాలజీ-2, ఏపీఎస్ఆర్టీసీ-1, గ్రామీణ నీటి సరఫరా-1, జాతీయ రహదారులు-1, ఎక్సైజ్-1, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం-1, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్-1, ఉపాధి కల్పన-1, కాలుష్య నియంత్రణ బోర్డు-1, ఇంటర్మీడియట్ విద్య-1, వ్యవసాయం-1 ఉన్నాయి. కలెక్టర్ మాట్లాడుతూ. . సంబంధిత శాఖల అధికారులు అర్జీలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పౌర సరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ రజనీ కుమారి తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తు స్వీకరిస్తున్న కలెక్టర్ సృజన

లక్ష్మి.. వరించేనా..!

బుడమేరు వరదలో ఇళ్లు మునిగిపోయి పరిహారం అందని బాధితులు అధిక సంఖ్యలో సోమవారం విజయవాడ కలెక్టరేట్‌కు తరలి వచ్చారు. ఓ మహిళ.. చంటిపాపతో వచ్చి దరఖాస్తు పూర్తిచేసి, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు అందించారు. - ఈనాడు, అమరావతి



సీపీ కార్యాలయంలో.. 78 ఫిర్యాదులు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 78 ఫిర్యాదులు వచ్చాయి. ట్రాఫిక్ డీసీపీ ఎం.కృష్ణమూర్తినాయుడు, డీసీపీ ఉదయరాణి, క్రైం ఏడీసీపీ ఎం.రాజారావు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వినతులు స్వీకరించారు. వచ్చిన మొత్తం 78 ఫిర్యాదుల్లో. . మోసాలపై 18, నగదు లావాదేవీలు 16, కుటుంబ కలహాలు 15, భూ వివాదాలు 2, వేధింపులు 8, దొంగతనాలు 6, ఇతర సమస్యలపై 13 చొప్పున వచ్చాయి. పరిష్కారం నిమిత్తం వాటిని సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులకు పంపించారు.



మహిళ సమస్య వింటున్న డీసీపీ కృష్ణమూర్తినాయుడు

ఆలపాటి రాజాను అత్యధిక మెజార్టీతో గెలిపించండి

ఆటోనగర్, న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని తెదేపా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల అధ్యక్షులు నెట్టెం రఘురాం, కొనకళ్ల నారాయణ పిలుపునిచ్చారు. సోమవారం విజయవాడ ఆటోనగర్‌లోని తెదేపా జిల్లా కార్యాలయంలో అభ్యర్థి ఆలపాటి రాజా ఉమ్మడి కృష్ణా జిల్లా తెదేపా నాయకులతో సమావేశమయ్యారు. రాజాను భారీ మెజార్టీతో గెలిపించాలని, అందులో భాగంగా ఎవరి నియోజకవర్గాల్లో వారు పట్టభద్రుల ఓట్లు నమోదు చేయించాలని తీర్మానించారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్, శ్రీరాం తాతయ్య, కాగిత కృష్ణప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబం యూనిట్‌గా ఆర్థిక సాయం

కృష్ణలంక, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ముంపు ప్రభావిత బాధితులకు కుటుంబం యూనిట్‌గా ఆర్థిక సహాయం అందిస్తోందని, కుటుంబంలో ఒకరిని గుర్తించి వారి ఆధార్‌కు అనుసంధానమైన బ్యాంకు ఖాతాలో డీబీటీ ద్వారా నగదు జమ చేస్తోందని కలెక్టర్ జి.సృజన సోమవారం తెలిపారు. కుటుంబంలో మరో వ్యక్తిని లబ్ధిదారుడిగా గుర్తించడానికి వీలు లేదనే విషయాన్ని గుర్తించాలని, అనవసరంగా అర్జీలు దాఖలు చేయవద్దని సూచించారు. ఇప్పటివరకు ఇళ్లు, వాహనాలు తదితర నష్టాలకు సంబంధించి 1,12,481 బ్యాంకు ఖాతాల్లో సాయం జమ చేసినట్లు తెలిపారు.

ఆధార్, బ్యాంకు ఖాతా లింక్ చేసుకోండి.. ఎన్యూమరేషన్ జరిగి గుర్తించిన లబ్ధిదారులందరికీ ప్రభుత్వం పరిహారం మంజూరు చేసిందని, ఆధార్‌తో బ్యాంకు ఖాతా అనుసంధానం కాకపోవడం, ఖాతా వినియోగంలో లేకపోవడం తదితర కారణాల వల్ల సుమారు 20 వేల మందికి నగదు జమ కాలేదని చెప్పారు. ఆ విషయాన్ని లబ్ధిదారుల చరవాణులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. సత్వరమే ఆధార్‌కు బ్యాంకు ఖాతా అనుసంధానం చేసుకుని వినియోగంలోకి తెచ్చుకోవాలని సూచించారు. అర్హత పొందిన లబ్ధిదారుల జాబితాలు సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో ఉన్నాయని, అక్కడ పేర్లు ఉండి ఇంకా పరిహారం జమకాకపోతే ఆధార్‌తో బ్యాంకు ఖాతా అనుసంధానం కాలేదని గుర్తించి ఆ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఆధార్‌తో అనుసంధానం చేసిన రెండు రోజుల్లోపు ఖాతాల్లో పరిహారం జమ అవుతుందని, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని చెప్పారు. పరిహారం కోరుతూ గ్రీవెన్స్‌లో సమర్పించిన అర్జీలను పరిశీలించి రెండు, మూడు రోజుల్లో అర్హులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

బస్‌పాస్ కౌంటర్ల సమయం మార్పు

విజయవాడ బస్‌స్టేషన్, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా ఉన్న బస్‌పాస్ కౌంటర్ల సమయాన్ని మార్పు చేస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.వై దానం సోమవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఉదయం 9 నుంచి సాయంత్రం 6 వరకు, ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు పని చేస్తాయని చెప్పారు. విద్యార్థులు, ప్రయాణికులు గమనించాలని కోరారు.

నృత్యకేళీ.. ఆనందాల రంగేళి



శాస్త్రీయ నృత్యం..

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థినులు వేదికపైకి వచ్చి ప్రదర్శనలిచ్చారు. తమ కళా నైపుణ్యాలతో నృత్యాలు చేస్తూ భళా అనిపించారు. సిద్ధార్థ అకాడమీ, ముమ్మనేని సిద్ధార్థ కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో సిద్ధార్థ నృత్యోత్సవ్-2024 కార్యక్రమాన్ని విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో సోమవారం రాత్రి నిర్వహించారు. సిద్ధార్థ విద్యాసంస్థలకు చెందిన ఇంజినీరింగ్, వైద్య, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలకు చెందిన 125 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. శాస్త్రీయ సంగీతం ఆలపించారు. నృత్యం ప్రదర్శన చేశారు. జానపద గీతాలకు అభినయం చేశారు. స్త్రీశక్తి, దేశభక్తి తదితర అంశాలపై నృత్యరూపకాలు ప్రదర్శించారు. ఇటీవల వైద్య విద్యార్థిని అత్యాచారం ఘటనపై ప్రదర్శించిన నృత్య రూపకం ఆద్యంతం ఆసక్తిగా, మనసును హత్తుకునేలా సాగింది. మధురమైన సంగీతంతో మైమరపించారు. ప్రదర్శనలిచ్చిన వారికి సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సి.నాగేశ్వరరావు, కళాపీఠం అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి ఎన్.లలితప్రసాద్ బహుమతులు అందజేశారు.



జానపదం..



పరికిణీలో హొయలు..

దొరకని తల్లీబిడ్డల ఆచూకీ

పటమట, న్యూస్‌టుడే: విజయవాడ స్క్రూబ్రిడ్జ్ సమీపంలోని బందరు కాలువలో ఆదివారం దూకిన వివాహిత తిరుపతి సుధారాణి, కుమార్తె జాస్విల ఆచూకీ తెలియరాలేదని పటమట పోలీసులు తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది రెండు రోజులుగా వారి కోసం గాలిస్తున్నారు. సోమవారం స్క్రూబ్రిడ్జి నుంచి యనమలకుదురు వరకు కాలువను జల్లెడ పట్టినా వారి ఆచూకీ లభ్యమవ్వలేదు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ వచ్చి ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. కుటుంబ కలహాల నేపథ్యంలో తల్లి తన ఇద్దరు పిల్లలతో కాలువలో దూకగా.. అందులో నాలుగు నెలల చిన్నారి మృతి చెందిన సంగతి తెలిసిందే.



బందరు కాలువలో గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

'సర్దుబాటు ఛార్జీల ప్రతిపాదన విరమించుకోవాలి'

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : విద్యుత్తు సర్దుబాటు ఛార్జీల పేరిట రూ. 7200 కోట్లు భారం మోపేందుకు రంగం సిద్ధమైందని, ఈ ప్రతిపాదనను విరమించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సి.హెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2022-23 సంవత్సరానికి రూ. 7,200 కోట్లు సర్దుబాటు ఛార్జీలు మోపుతూ.. విద్యుత్తు నియంత్రణ మండలి ఒక బహిరంగ ప్రకటన విడుదల చేసిందన్నారు. ఇప్పటికే మూడు రకాల ఛార్జీలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. తెదేపా అధికారంలోకి వస్తే ఛార్జీలు పెంచమని, తగ్గిస్తామని ప్రజలకు మాట ఇచ్చిందన్నారు. గత ప్రభుత్వం కప్పిపుచ్చిందని, కూటమి ప్రభుత్వం భారాల ప్రతిపాదనను ముందుకు తెచ్చిందన్నారు. అభ్యంతరాల స్వీకరణ, బహిరంగ విచారణలు.. మొక్కుబడి తంతు మాత్రమేనని విమర్శించారు. వైకాపా ప్రభుత్వం సర్దుబాటు ఛార్జీలు తెస్తే తెదేపా వ్యతిరేకించిందని, ఇపుడు తెదేపానే ఈ ప్రతిపాదన తీసుకురావడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. దసరా కానుకగా ఈ భారాన్ని మోపుతున్నారా అని ప్రశ్నించారు. దీన్ని ఉపసంహరించుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు డి.వి.కృష్ణ, డి.కాశీనాథ్, కె.శ్రీదేవి, పి.వి.ఆంజనేయులు, ఎన్.సి.హెచ్.శ్రీనివాస్, కె.కల్యాణి, బోయ సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.



పత్రాలు చూపుతున్న బాబూరావు కృష్ణ, కాశీనాథ్, శ్రీదేవి తదితరులు

లారీ ఢీకొని యువకుడి మృతి


తాడేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక కనకదుర్గమ్మ వారధిపై ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో విజయవాడ కృష్ణలంకకు చెందిన కృపామనోజ్ (21) అక్కడికక్కడే మృతి చెందాడని తాడేపల్లి పోలీసులు తెలిపారు. ఆదివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకున్నట్లు తెలిపారు. ఓ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్న కృపామనోజ్ తాడేపల్లిలో నగదు రావాల్సి ఉండటంతో వాటి వసూలు కోసం ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగి వెళుతుండగా ప్రమాదం జరిగింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెట్ దుకాణాలపై దళారుల కన్ను

షాపులు ఇప్పిస్తామని ఎర

గొల్లపూడి, న్యూస్‌టుడే

గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో జాతీయరహదారి వెంబడి, టోకు వ్యాపార కేంద్రం రోడ్డులో నిర్మిస్తున్న 90 దుకాణాలపై దళారుల కన్ను పడింది. వాటిని ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసేందుకు కొందరు ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే..సదరు వ్యాపారులు మార్కెటింగ్ శాఖ అధికారులను సంప్రదించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఆ దుకాణాలను ఏవిధమైన మధ్యవర్తిత్వం లేకుండా పారదర్శకంగా బహిరంగ వేలం ద్వారా కేటాయింపులు చేస్తామని మార్కెటింగ్ శాఖ అధికారులు వారికి తెలిపారు. గతంలో కూడా మార్కెట్ యార్డు ప్రాంగణంలోని స్థలాన్ని కేటాయిస్తామంటూ పూల మార్కెట్‌లోని వ్యాపారుల వద్ద నుంచి కొందరు డబ్బులు వసూలు చేయగా వ్యాపారులు లక్షల్లో నష్టపోయారు.



జాతీయ రహదారి వెంబడి నిర్మిస్తున్న దుకాణాలు ఇవే..

వారి మాటలు నమ్మొద్దు

గొల్లపూడి మార్కెట్‌యార్డు ప్రాంగణంలోని దుకాణాలను కొనుగోలుకు, లీజుకు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసేందుకు కొందరు దళారులు ప్రయత్నాలు చేస్తున్నట్లుగా మా దృష్టికి వచ్చింది. అలాంటి మాటలను నమ్మొద్దు. వాటిని ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రకటన జారీ చేసిన తర్వాతే అర్హులైన వారికి అద్దె ప్రాతిపదికన కేటాయిస్తాం. - దివాకర్, ప్రాంతీయ ఉప సంచాలకులు

తిరువూరు

• తిరువూరు • మైలవరం

పింఛన్ల పంపిణీ నేడు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: సామాజిక పింఛన్ల పంపిణీ మంగళవారం జరుగుతుందని లబ్ధిదారులంతా ఇంటి దగ్గర ఉండి నగదు తీసుకోవాలని ఎంపీడీవో బి.వై.విష్ణు ప్రసాద్ తెలిపారు. 2 తేదీ సెలవైనా పింఛన్లు ఇస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

2న గ్రామ సభ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో 2 తేదీన గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బి.వై.ప్రసాద్ తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులను గుర్తించి గ్రామ సభలో ఆమోదించనున్నామని పేర్కొన్నారు.

రఘునందన్‌కు సత్కారం

తిరువూరు, న్యూస్‌టుడే: అభ్యుదయ రచయితల సంఘం జిల్లా కార్యదర్శి రేపాక రఘునందన్‌ను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సత్కరించారు. ప్రథమ తెలుగు మహాసభల రూపకర్త మాజీ మంత్రి, దివంగత మండలి వెంకటకృష్ణారావు జ్ఞాపకార్థం ప్రకృతి వైద్యశాలలో అవనిగడ్డలో ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనానికి రఘునందన్‌ను ఆహ్వానించగా ఆయన కవిత పఠనం చేశారు.



అరసం జిల్లా కార్యదర్శి రఘునందన్‌ను సన్మానిస్తున్న అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

బాధితులను ఆదుకున్న

ప్రభుత్వానికి ధన్యవాదాలు



స్వర్ణాంధ్ర-2047 గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం సాయంత్రం మండలాధ్యక్షురాలు పాలడుగు జ్యోత్స్న అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో వివిధ శాఖలకు చెందిన అధికారులు వరదల నేపథ్యంలో తమతమ శాఖలకు చెందిన ఆస్తులతో పాటు గ్రామస్థులకు జరిగిన నష్టం వివరాలను పేర్కొన్నారు. ప్రభుత్వం అందించిన ఆర్థికసాయాన్ని వివరించారు. కొందరు సభ్యులు వరద నష్టం నమోదు సక్రమంగా జరగలేదని అధికారులకు వివరించారు. స్పందించిన పశుసంవర్ధక శాఖ అధికారి.. సకాలంలో సమాచారం ఇచ్చిన వారందరికీ జరిగిన పశునష్టం తదితర వివరాలను నమోదు చేసి పరిహారం కూడా చెల్లించామన్నారు. తహసీల్దారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వాస్తవంగా నష్టం జరిగి నమోదు కాని బాధితుల నుంచి కలెక్టరు ఉత్తర్వుల మేరకు దరఖాస్తులు తీసుకుంటున్నామన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర-2047 గోడపత్రికను అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ఆవిష్కరించారు. సమావేశాన్ని ఎంపీడీవో రామకృష్ణ నాయక్ పర్యవేక్షించారు. మండల పరిధిలోని గ్రామ సర్పంచులు ఎంపీటీసీలు, కార్యదర్శులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. వరదల సమయంలో బాధితులకు అండగా ఉన్న సీఎం, ఎమ్మెల్యే అధికారులకు, ధన్యవాదాలు తెలుపుతూ సమావేశంలో తీర్మానించారు. గ్రామ పంచాయతీలకు రూ.లక్ష చొప్పున సొంత అందించిన ఉప ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపారు.

కనుకరిస్తే..ఉండదు ఎదురుచూపు

ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాల్లో నిలిచిన సేవలు

నిరాశతో వెనుదిరిగి వెళ్తున్న పేదలు

తిరువూరు, న్యూస్‌టుడే

పేదలకు కంటి వెలుగులు అందించే ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాల్లో సేవలు నిలిచాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆపోలో సంస్థతో చేసుకున్న ఒప్పందం ఈనెల 17తో ముగిసింది. తిరిగి పునరుద్ధరించకపోవడంతో ప్రభుత్వ వైద్యశాలల్లోని కేంద్రాల తాళాలు వేసి దర్శనమిస్తున్నాయి. ఇప్పటి వరకు సేవలు పొందిన ప్రజలు నిరాశతో వెనుదిరిగి వెళ్తున్నారు. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న గ్రామీణ ప్రజలకు సేవలు చేరువ చేయడానికి 2018లో ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాలకు అప్పటి తెదేపా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా జిల్లాలోని తిరువూరు, మైలవరం, నందిగామ ప్రభుత్వ వైద్యశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రంలో ఆప్తమాలజిస్టు, ఎక్విప్‌మెంట్ అసిస్టెంట్‌ను నియమించారు. కంటి పరీక్షలు చేయడానికి అత్యాధునిక పరికరాలను సమకూర్చారు. దాదాపు ఆరేళ్ల పాటు సేవలు అందించిన కేంద్రాలు మూతపడడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తిరిగి ప్రైవేటు ఆస్పత్రుల బాట పడుతున్నారు. ఓపీ చీటీ నుంచి చికిత్స వరకు చేతిచమురు వదిలించుకుంటున్నారు.



తిరువూరు ప్రాంతీయ వైద్యశాలలోని ఈ-ఐ కేంద్రం

సేవలు పూర్తిగా ఉచితం

ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాల్లో కంటి సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా సేవలు అందించారు. ఇక్కడి కేంద్రానికి రోజుకు సుమారు 40 నుంచి 50 మంది వరకు పరీక్షలు చేయించుకునేందుకు వచ్చేవారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని సూచించిన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించేవారు. ఆధార్‌కార్డు ఆధారంగా ఆన్‌లైన్లో రోగుల వివరాలు నమోదు చేయగానే వారం రోజుల వ్యవధిలో కళ్లజోళ్లు సరఫరా చేశారు. చుక్కల మందులు, మందుబిళ్లలు ఉచితంగా అందించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆధార్‌కార్డు చేతపట్టుకుని వచ్చి ఇక్కడి కేంద్రాల్లో సంతృప్తికరమైన సేవలు పొందారు. ప్రస్తుతం పరికరాలను తరలించడంతో పాటు సిబ్బందిని తాత్కాలికంగా పక్కన పెట్టారు. సేవలు ఎందుకు నిలిపివేశారో తెలియక ప్రజలు అయోమయం వ్యక్తం చేస్తున్నారు.

ఒప్పందం గడువు ముగిసింది

ప్రభుత్వం ఆపోలో సంస్థతో చేసుకున్న ఒప్పందం గడువు ముగియడంతో సేవలు నిలిపివేశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఒప్పందం పునరుద్ధరించగానే సేవలు తిరిగి ప్రారంభిస్తాం.

- డాక్టర్ గార్గేయ, సూపరింటెండెంట్, ప్రాంతీయ వైద్యశాల

గండ్లు పూడ్చివేత

ఈనాడు కథనానికి స్పందన



జి.కొండూరు, న్యూస్‌టుడే: ఇటీవల సంభవించిన వరదలకు కవులూరు వెలగలేరు గ్రామాల మధ్యలో కోతకు గురైన రహదారికి మరమ్మతులు చేపట్టకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడిందని సమస్యపై ఈ నెల 29వ తేదీన ఈనాడులో 'దాటలేకున్నాం.. గండ్లు పూడ్చండి' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీరాజ్ సహాయక ఇంజినీర్ శ్రీనివాసరావు గండిని తాత్కాలికంగా గ్రావెల్‌తో పూడ్చి రాకపోకలను పునరుద్ధరించారు. దీంతో స్థానికులు రాకపోకలకు అవస్థలు తొలగాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈకేవైసీ నమోదు తప్పనిసరి

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని తూర్పు మాధవరం పీఏసీఎస్‌లో సోమవారం పర్సన్ ఇన్‌ఛార్జీ ఎన్.వి.సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సభ్యులకు కేవైసీ నమోదుపై అవగాహన కల్పించారు. సంఘం దస్త్రాలు కంప్యూటరీకరణ చేస్తున్న నేపథ్యంలో సభ్యులు తమ ఆధార్‌కార్డు అందజేసి కేవైసీ నమోదు చేయించుకోవాలని సూచించారు. నమోదు కాని సభ్యులు వివరాలు గ్రామ సచివాలయం నోటీసు బోర్డులో ఉంచినట్లు తెలిపారు. సీఈవో టీఎస్.నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

నష్టపోయిన వారికి సాయం అందలేదు



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ

జి.కొండూరు, న్యూస్‌టుడే: ఇటీవల సంభవించిన వరదల్లో నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం అందించే సహాయక చర్యల్లో మండల స్థాయి అధికారులు తమ పాత్ర లేకుండా వ్యవహరించారని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ వాపోయారు. స్థానిక సామాజిక భవనంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. వరద బాధితులతో సామగ్రి అందజేసే సమయంలో గ్రామంలో సర్పంచి, ఎంపీటీసీ సభ్యులను సంప్రదించలేదని దీంతో నష్టపోయిన వారికి కాకుండా నష్టపోనీ వారికి సాయం అందిందని వాపోయారు. కవులూరు-2 ఎంపీటీసీ సభ్యుడు డోలా మధు మాట్లాడుతూ తమ గ్రామంలో సైతం అనేక మంది బాధితులకు వరద సాయం అందలేదని, వరదతో ఎక్కువ నష్టపోయిన మా గ్రామానికి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అందజేసిన లక్ష రూపాయలు కూడా రాకపోవడం ఏంటని మండల అధికారులని నిలదీశారు. గడ్డమణుగు ఎంపీటీసీ సభ్యురాలు నూతక్కి అపర్ణ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేస్తూ, పుస్తకాలు, ఏకరూప దుస్తులు వారే బలవంతంగా విక్రయిస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎటువంటి చర్యలు చేపట్టలేదని ప్రశ్నించారు. తక్షణమే తనిఖీలు చేసి ప్రైవేట్ యాజమాన్యాల దోపిడీని అదుపు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.అనురాధ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

దాతల సేవలు హర్షణీయం



వరద బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ తదితరులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: బాధితుల సహాయార్థం దాతలు ముందుకు రావడం హర్షణీయమని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ అన్నారు. వరద ముంపునకు గురైన పశ్చిమ ఇబ్రహీంపట్నం నివాసులకు రాంకో ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో నిత్యావసరాలను సోమవారం అందించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం, కొండపల్లి పరిసర ప్రాంత ప్రజలు ప్రకృతి విపత్తులతో పాటు కాలుష్యంతోనూ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ విషయాలను పరిశ్రమల యాజమాన్యాలు గుర్తించి వారికి రక్షణ కల్పించే చర్యలు చేపట్టాలన్నారు. తెదేపా నాయకులు సీతారామయ్య, రాంకో ఫ్యాక్టరీ హెడ్ పి.ఆనందరావు, హెచ్ఆర్ రామ్మోహనరావులు పాల్గొన్నారు.

రాత పుస్తకాల వితరణ

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: వివేకానంద రాత్ మెమోరియల్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం వరద బాధిత ప్రాంత విద్యార్థులకు సోమవారం చైతన్యానంద స్వామి రాత పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సదాశివాజీ, విజయ, రాము, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

గంపలగూడెం, న్యూస్‌టుడే: స్థానిక గ్రామదేవత ముత్యాలమ్మ గుడిలో సోమవారం కె.మోహన్, డి.వెంకటేశ్వరరావు తదితరుల ఆర్థిక సౌజన్యంతో పేదలు, వృద్ధులకు అన్నదానం చేసినట్లు నిర్వాహకురాలు కె.కృష్ణకుమారి తెలిపారు.

బొర్రా వెంకటేశ్వరరావుకు నివాళి

కొండపల్లి: కాంగ్రెస్ పార్టీకి సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న బొర్రా కుటుంబానికి ఉన్నత స్థానమే ఉంటుందని కేంద్ర మాజీ రక్షణ శాఖ సహాయ మంత్రి పల్లంరాజు పేర్కొన్నారు. మాజీ జడ్పీటీసీ బొర్రా వెంకటేశ్వరరావు దశదిన కార్యక్రమంలో ఆయన పాల్గొని వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

పరిహారం అందజేతపై ఆనందం

మైలవరం, న్యూస్‌టుడే: వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు నష్ట పరిహారం జమ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం స్థానిక తారకరామానగర్‌లో లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. రోజుల వ్యవధిలోనే బాధితులను ఆదుకోవడం శుభ పరిణామమని సంతోషం వ్యక్తపరిచారు. కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణ, బాలకృష్ణ, లితీష్, ప్రసాద్, జల్లి కృష్ణ, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే వసంత చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యమివ్వండి

మైలవరం, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, యూత్ రెడ్‌క్రాస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో సోమవారం మైదానంలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడమే గాక, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని ప్రిన్సిపల్ ఇళ్లా రవి సూచించారు. స్వభాన్ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛత నినాదంతో అక్టోబరు 2 వరకు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప ప్రిన్సిపల్ రంగారావు, ప్రోగ్రాం అధికారి ఫణికుమార్, మన్నేస్వామి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



డిగ్రీ కళాశాల ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు

పంట నమోదు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో పద్మ

తిరువూరు, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో భాగంగా రైతులు సాగు చేసిన పంటల వివరాలు గడువులోపు నమోదు పూర్తి చేయాలని ఏవో పి.పద్మ సూచించారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈకేవైసీ ప్రాముఖ్యతను రైతులకు వివరించి అవగాహన కల్పించాలని తెలిపారు. ఓటీపీ, బయోమెట్రిక్ పద్ధతిలో పంటల వివరాలు నమోదు వేగవంతం చేయాలన్నారు.

పస్తులు ఉండి పనిచేయాలా..?



చెత్త సంపద కేంద్రం వద్ద పారిశుద్ధ్య కార్మికుల నిరసన

కొండపల్లి, న్యూస్‌టుడే: పస్తులు ఉండి పనిచేయాలా అంటూ ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. నాలుగు నెలల వేతనాలు చెల్లించాలంటూ కొండపల్లి పారిశుద్ధ్య కార్మికులు స్థానిక చెత్త సంపద కేంద్రం వద్ద సోమవారం రాత్రి నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాలు చెల్లించనందున నిరసనగా గాంధీ జయంతి రోజున పురపాలికలో భిక్షాటన చేసి వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. కార్మికుల సేవలు మరువలేనివి అంటూనే వేతనాలు మాత్రం చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

భారమైనా భరిస్తున్నారు



డ్రమ్ములతో తెచ్చిన నీటితో మిరప మొక్కలు నాటుతున్న కూలీలు

మిరప మొక్కలు నాటేందుకు అన్నదాతలకు నీటి కొరత ఏర్పడింది. ప్రస్తుతం మండుతున్న ఎండలకు భూములు ఎండిపోయాయి. ఈ నెల మొదటి పక్షంలో కురిసిన అధిక వర్షాలకు మిరప మొక్కలు నాటేందుకు సాధ్యమవ్వలేదు. వాన తెరపిచ్చాక నాటేందుకు మొక్కలు సిద్ధం చేయగా భూమిలో తేమ శాతం సరిపోవడంలేదు. దీంతో గంపలగూడెంలో పలువురు రైతులు డ్రమ్ములతో నీరు పొలాలకు తెచ్చుకుని మొక్కలు నాటుతున్నారు. కొందరు దూరంగా ఉన్న బోర్ల నుంచి పైపులు ఏర్పాటు చేసి నీరు సరఫరా చేసుకుని మిరప సాగుకు వినియోగిస్తున్నారు.

- న్యూస్‌టుడే, గంపలగూడెం

సామూహిక సీమంతం



వేడుకలో గర్భిణులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని చైతన్యనగర్‌లో సోమవారం జాతీయ పోషకాహార మాసోత్సవం పురస్కరించుకొని ఐసీడీఎస్ ఉద్యోగుల ఆధ్వర్యంలో 10 మంది గర్భిణులకు సీమంతం చేశారు. సర్పంచి బి.ఝాన్సీ, సూపర్‌వైజర్ పి.శివకుమారి, అంగన్‌వాడీలు పాల్గొని గర్భిణులు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు.

సర్వీసు రోడ్లు వేస్తే మేలు

న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

ఆరు వరుసలుగా హైదరాబాద్ జాతీయరహదారిని గొల్లపూడి వరకు విస్తరించే నేపథ్యంలో మైలవరం నియోజకవర్గ పరిధిలోని గ్రామాలకు ఇరువైపులా సర్వీసు రోడ్లతో పాటు పశువుల రహదారులను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు. ప్రస్తుతం నాలుగు వరుసలుగా హైదరాబాద్ విజయవాడ జాతీయరహదారి నియోజకవర్గ పరిధిలో దొనబండ నుంచి గొల్లపూడి వరకు 30 కిలో మీటర్ల పొడవున విస్తరించింది. తొలుత ఈ రహదారిని హైదరాబాద్ సమీపంలోని దండు మల్కాపురం నుంచి జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లె వరకు విస్తరించాలనుకున్నారు. రాష్ట్ర రాజధాని అమరావతిని దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తులో పెరగనున్న ట్రాఫిక్‌ను అంచనావేసి మరో 40 కిలో మీటర్లు గొల్లపూడి వరకు పెంచాలని సవివర నివేదిక(డీపీఆర్) తయారు చేయాలని జాతీయరహదారుల మంత్రిత్వశాఖ నిర్ణయించింది. నందిగామ జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో జాతీయరహదారి గ్రామాల బయట నుంచి వెళ్తుంది.



దొనబండ నుంచి జాతీయరహదారి ఇరువైపులా విస్తరించిన గ్రామాలు

అయితే మైలవరం నియోజకవర్గం పరిధిలో మాత్రం ఈ రహదారికి ఇరువైపులా గ్రామాలు విస్తరించి ఉన్నాయి. ఎక్కడా సర్వీసు రోడ్లు పశువుల రహదారులు లేకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. సగటున నెలకు ఆరేడు

ప్రమాదాలు పెరుగుతున్నాయి..

ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిల్లో మృతుల సంఖ్య రెండు నుంచి నాలుగు వరకు ఉంటున్నట్లు పోలీసు గణాంకాలు తెలుపుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం అమరావతి రాజధాని పనులు ముమ్మరంగా జరుగుతుండటంతో దొనబండ నుంచి గొల్లపూడి వరకు ట్రాఫిక్ రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది అదే స్థాయిలో పెరుగుతున్న ప్రమాదాల తీవ్రత ఆందోళనకు గురిచేస్తుంది.

అంచనాలు వేయాలి

గ్రామస్థులు పరిసర గ్రామాలతోపాటు విజయవాడకు రాకపోకలు సాగించాలంటే జాతీయరహదారిని దాటాల్సిందే. గ్రామాల్లోని అంతర్గత రోడ్లపైకి రావాలంటే అపసవ్య దిశ ప్రయాణాలు తప్పనిసరి. ఈ క్రమంలోనే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని రవాణా పోలీసుశాఖ అధికారులు పేర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన వృత్తి వ్యవసాయం పశుపోషణ కావడంతో వివిధ పశువుల సంఖ్య కూడా అధికంగానే ఉంది. పశువుల రాకపోకల సందర్భంగా ట్రాఫిక్ అంతరాయాలు ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. వీటి నివారణకు ముందస్తుగా సర్వీసు రోడ్లతో పాటు పశువుల రహదార్ల ఏర్పాటుకు డీపీఆర్‌లోనే పేర్కొంటూ అంచనాలు వేయాల్సి ఉందని స్థానికులు కోరుతున్నారు.

రేపు మాంసం దుకాణాలకు సెలవు

భవానీపురం, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకుని కబేళా, చేపల మార్కెట్లు, మాంసం దుకాణాలకు బుధవారం సెలవు ప్రకటిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా అనుమతి లేకుండా జీవాలను వధించడం, దుకాణాలను తెరిచి మాంసం విక్రయాలను చేసినట్లయితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేయాలని కోరారు.

విజయవాడ తూర్పు

విద్యుత్తు సరఫరాలో నేడు అంతరాయం

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: మరమ్మతులు, నిర్వహణ నేపథ్యంలో మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు రెవెన్యూ కాలనీ, ఎస్ రామారావురోడ్డు, సిద్ధార్థ పబ్లిక్ పాఠశాల రోడ్డు, ఖాందారీ రోడ్డు, పార్క్ రోడ్డు, కృష్ణనగర్, కామినేని వారి వీధి, టిక్కిల్‌రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ ఈఈ పి.రవీంద్రబాబు తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు వాటర్ ట్యాంక్ రోడ్డు, బావాజీపేట, జక్కయ్యవీధి, జానీవీధి, కార్పే కార్యాలయం, యూనియన్ బ్యాంక్, వాటర్ ట్యాంక్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని ఆయన చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80085 74652

- 8వ డివిజన్ సిద్ధార్థ కళాశాల ఎదురుగా తాగునీటి పైపులైను లీకేజీ అవుతోందని స్థానిక నివాసి రవీంద్ర ఏఈ నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మరమ్మతులు చేయించారు.
- 11వ డివిజన్ పటమట కరణం వారి వీధి 11-201/86, 85 విద్యుత్తు స్తంభాలకున్న దీపాలు వెలగడం లేదని స్థానిక నివాసి బి. వెంకటేశ్వరరావు ఏఈ నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాలు ఏర్పాటు చేయించారు.

? కరెన్సీనగర్ శాఖమూరి శివయ్య వీధిలో చెత్త ఎత్తడం లేదు. ఇబ్బందికరంగా ఉంది. తొలగించండి **- కుమార్**

✔ చెత్త తొలగిస్తాం **- ఆంథోని, శానిటరీ అధికారి**

- న్యూస్‌టుడే, కరెన్సీనగర్

పరిహారం దూరం!

❖ వివిధ కారణాలతో జమ కాని సొమ్ము ❖ ఆదుకోవాలంటున్న వరద బాధితులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

భారీ వర్షాలు, వరదకు ఇటీవల రామలింగేశ్వర నగర్ ముంపునకు గురైంది. ప్రజలు కట్టుబట్టలతో మిగిలారు. ఇంట్లోని సామగ్రి, వాహనాలు, ఆటోలు తడిసి పనికి రాకుండా పోయాయి. విజయవాడలోనే ఉంటూ సహాయక చర్యలను పర్యవేక్షించిన సీఎం చంద్రబాబు బాధితులకు నష్ట పరిహారం అందిస్తామని ప్రకటించారు. సర్వే చేసి జాబితా విడుదల చేశారు. సర్వే సిబ్బంది లోపాల వల్ల కొంతమంది అర్హులకు పరిహారం అందలేదు.

❖ జాబితాలో కొందరి పేర్లున్నా ఖాతాల్లో నగదు పడలేదు. ఇంటి యజమానికి పరిహారం వచ్చింది. అద్దెకు ఉన్న వారికి రాలేదు. తండ్రి, కొడుకు వేర్వేరుగా ఉంటే.. ఒకరినే పరిగణనలోకి తీసుకున్నారు. ఇలా వివిధ కారణాలతో పరిహారం దూరమైంది. అటువంటి వారంతా సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాలేదని, ఇళ్ల మ్యాపింగ్ చేయలేదని వివిధ కారణాలు సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.



రామలింగేశ్వరనగర్ 72వ నంబరు సచివాలయంలో జాబితా పరిశీలిస్తున్న సిబ్బంది, బాధితులు

ఒక్కరికే ఇచ్చారు



గాంధీ కాలనీలో నాకు రెండు ఇళ్లు ఉన్నాయి. మొత్తం 8 గదులు ఉన్నాయి. కొన్ని ఇళ్లలో మేము ఉంటున్నాం. మిగిలినవి అద్దెకు ఇచ్చాను. వరదకు అవీ మునిగాయి. పైకప్పు రేకులు దెబ్బతిన్నాయి. ఇంటి గోడ, స్నానాల గది కూలిపోయాయి. రూ.2 లక్షలకు పైగా నష్టం జరిగింది. సర్వే బృందం నష్టం నమోదు చేసినా ఒక్కరికే పరిహారం ఇచ్చారు.

- ఎన్.శంకరరావు

జాబితాలో మా పేరు లేదు



యర్రపోతువారివీధిలో కొన్నేళ్ల నుంచి ఉంటున్నాం. నా భర్త ఆటో నడుపుతారు. వరదలప్పుడు ఆటోపై చెట్టు పడింది. మా ఇల్లు మునిగిపోయింది. సామాన్లు, కూలర్, ఫ్యాన్లు దెబ్బతిన్నాయి. మరమ్మతులకు రూ.20 వేలు అయ్యాయి. ఇల్లు దెబ్బతింది. పరిహారం జాబితాలో మాత్రం మా పేరు లేదు. సమాధానం చెప్పేవారు కరవయ్యారు. **- ఎన్.ధనలక్ష్మి**

రూ.25 వేల వరకు ఖర్చు



సిబ్బంది సర్వే చేశారు. నష్టాన్ని నమోదు చేసుకున్నారు. ఖాతాల్లో మాత్రం పరిహారం సొమ్ము పడలేదు. సచివాలయానికి వెళ్తే మీకు రాలేదని చెప్పారు. ఇల్లు మునిగిపోయింది. రెండు ద్విచక్రవాహనాలు, వాషింగ్, కుట్టు మిషన్లు పనిచేయ లేదు. మరమ్మతులకు రూ.25 వేల వరకు ఖర్చు చేశాం. ప్రభుత్వం స్పందించి సాయం అందించాలి. **-కె.లక్ష్మీతిరుపతమ్మ**

నగదు జమ కాలేదు



గాంధీ కాలనీలో ఉంటున్నాం. ఇల్లు మునిగిపోయింది. కట్టుబట్టలతో బయటకు వచ్చాం. ద్విచక్ర వాహనం, ఫ్రిజ్, మిక్సీ, ఇస్త్రీపెట్టె దెబ్బతిన్నాయి. కష్టకాలంలో సీఎం చంద్రబాబు పరిహారం ఇచ్చి ఆదుకుంటున్నారని ఆనందించాం. కానీ మా ఖాతాలో నగదు జమకాలేదు. సచివాలయానికి వెళ్లి ఆరా తీస్తే జాబితాలో పేరు లేదన్నారు. పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

- వి.భవానీ

బాధ్యతగా పట్టభద్రుల ఓటరు నమోదు

పటమట, న్యూస్‌టుడే: కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఓటరు నమోదును తెదేపా శ్రేణులు బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో తూర్పు నియోజకవర్గ తెదేపా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. రామ్మోహన్ మాట్లాడుతూ... గతంలో తూర్పులో 18 వేల మంది పట్టభద్రుల ఓట్లు ఉన్నారని, వారితో పాటు కొత్తగా అర్హులైన వారందరినీ ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. అక్టోబర్ 1 నుంచి తెదేపా సభ్యత్వ నమోదు ప్రారంభవుతుందని, నియోజకవర్గంలో ఎక్కువ సభ్యత్వాలు నమోదు చేయాలని సూచించారు. నాయకులు నారాయణ ప్రసాద్, ఫిరోజ్, చెన్నుపాటి గాంధీ, గుండు శ్రీను, జాస్తి సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల జీతాల పెంపునకు కృషి

పటమట, న్యూస్‌టుడే: వరదల సమయంలో పారిశుద్ధ్య కార్మికులు చేసిన సేవలు ఎనలేనివని, సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి వారి జీతాల పెంపునకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. మంగళవారం 9వ డివిజన్‌లోని పాతూరి నాగభూషణం పార్కు వద్ద పారిశుద్ధ్య కార్మికులకు ఎమ్మెల్సీ అశోక్‌బాబు అందించిన చీరలను ఆయన పంపిణీ చేశారు. నాయకులు చెన్నుపాటి గాంధీ, చెన్నుపాటి క్రాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న గద్దె రామ్మోహన్, అశోక్‌బాబు తదితరులు

వెంకన్నకు ప్రత్యేక పూజలు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ చేసినందుకు నిరసనగా సోమవారం రాత్రి జనసేన పార్టీ నగర సంయుక్త కార్యదర్శి పాలవలస కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని రావిచెట్టు సమీపంలో వెంకటేశ్వరస్వామి చిత్రపటం పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు దీపారాధన చేశారు.

హీరో కార్తీ సందడి

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : నగరంలో ప్రముఖ హీరో కార్తీ సందడి చేశారు. సత్యం సుందరం చిత్రం విజయోత్సవంలో భాగంగా సోమవారం ఎంజీ రోడ్డులోని ఓ హోటల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బావ బావమరుదుల సన్నిహిత్యాన్ని ఈ చిత్రంలో చూడొచ్చని, దీనిని సుప్రసిద్ధ దర్శకుడు కె.విశ్వనాథ్ చిత్రాలతో పోల్చుకోవచ్చని తెలిపారు. 2018లో విజయవాడ వచ్చానని, మళ్లీ ఇప్పుడు వచ్చి దుర్గమ్మను దర్శించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. సీనియర్ నటుడు అరవిందస్వామితో కలిసి నటించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఖాకీ-2, సర్దార్-2 వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానున్నాయని, యుగానికి ఒక్కడు పార్ట్-2 దర్శకుడు ఒప్పుకుంటే చేస్తానని స్పష్టం చేశారు. దర్శకుడు సి.ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ... అందమైన దృశ్యకావ్యం సత్యం సుందరమని అన్నారు. రచయిత మౌళి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హీరో కార్తీ, పక్కన దర్శకుడు ప్రేమ్‌కుమార్, రచయిత మౌళి

వరద బాధితులకు న్యాయం చేయండి

కృష్ణలంక, న్యూస్‌టుడే: వరద బాధితుల సమస్యలు పరిష్కరించాలని ఎన్టీఆర్ జిల్లా సీపీఎం బృందం సోమవారం కలెక్టర్ జి.సృజనకు వినతి పత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ... ముంపు ప్రాంతాల్లో సర్వే సమగ్రంగా జరగనందున పలువురికి లబ్ధి చేకూరలేదని వివరించారు. రీ ఎన్యూమరేషన్ చేపట్టి పరిహారం అందని వారికి న్యాయం చేయాలని కోరారు. కేవైసీ, ఇతర కారణాల వల్ల కొన్ని ఖాతాలు మనుగడలో లేవని, బ్యాంకు అధికారులతో మాట్లాడి వినియోగంలో ఉన్న ఖాతాల్లో నగదు వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత ప్రజలు తమ సమస్యలు విన్నవించేందుకు, ఫిర్యాదు చేసేందుకు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పంటలు నష్టపోయిన రైతులకు హెక్టారుకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలని, కౌలు రైతులకు నేరుగా పరిహారం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధి కోల్పోయిన రైతు కూలీలకు రూ.5 వేలు సహాయం అందించి, దెబ్బతిన్న మోటార్లకు ఉచితంగా మరమ్మతులు చేయించాలని కోరారు. పాడైపోయిన రోడ్లు, వంతెనలను వెంటనే నిర్మించాలన్నారు. విద్యార్థుల ఇళ్లు మునగడంతో పుస్తకాలు, దుస్తులు, ధ్రువపత్రాలు కోల్పోయారని, వారికి దుస్తులు, పుస్తకాలు ఇవ్వాలని, పోయిన ధ్రువపత్రాలను ముఖ్యమంత్రి హామీ మేరకు ఇప్పించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో డీవీ కృష్ణ, దోనేపూడి కాశీనాథ్, కె.శ్రీదేవి, పీవీ ఆంజనేయులు తదితరులున్నారు.



కలెక్టర్ సృజనకు వినతి పత్రం సమర్పిస్తున్న బాబూరావు, డీవీ కృష్ణ, కాశీనాథ్ తదితరులు

కొనకళ్లకు సన్మానం

ఆటోనగర్, న్యూస్‌టుడే: ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమితులైన తెదేపా కృష్ణా జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావును సోమవారం ఆటోనగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం అభినందనలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ.. తెదేపా బలోపేతం కోసం అంకితభావంతో పని చేసిన కొనకళ్ల నారాయణకు సీఎం చంద్రబాబు తగిన గౌరవం ఇచ్చారన్నారు. పార్టీలో కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యం ఉంటుందనే విషయం రుజువైందని పేర్కొన్నారు. నాయకులు వాసం మునియ్య, యేదుపాటి రామయ్య, సారేపల్లి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

చిట్టినగర్ : స్థానిక నగరాల సీతారామస్వామి మహాలక్ష్మి(కొత్త) అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తి చేసినట్లు అధ్యక్ష, కార్యదర్శి లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు తెలిపారు. చిట్టినగర్‌లోని మహాలక్ష్మి కల్యాణ మండపంలో వారు మాట్లాడారు. పది రోజుల పాటు జరిగే ఉత్సవాలను పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రారంభిస్తారని చెప్పారు.

వైకాపా బలోపేతానికి కృషి

పటమట, న్యూస్‌టుడే: పార్టీ సీనియర్ల సూచనలు, సలహాలతో జిల్లాలో వైకాపా బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. సోమవారం జిల్లాలోని వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలతో రామవరప్పాడు రింగ్‌లోని ఓ హోటల్‌లో సమావేశం నిర్వహించారు. నూతన జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన అవినాష్‌ను నాయకులు అభినందించి సన్మానించారు. అవినాష్ మాట్లాడుతూ.. దసరా తర్వాత జిల్లాస్థాయి సమావేశం నిర్వహిస్తామన్నారు. కూటమి వంద రోజుల పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని విమర్శించారు. వరద బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని చెప్పారు. ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, రుహుల్లా, అరుణ్ కుమార్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శైలజారెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు మల్లాది విష్ణు, తన్నీరు నాగేశ్వరరావు, నల్లగట్ల స్వామిదాస్, జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బేసిక్ లైఫ్ సపోర్టుపై శిక్షణ

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఆయుష్ హాస్పిటల్‌లో ప్రజలకు బేసిక్ లైఫ్ సపోర్టు(బీఎల్ఎస్)పై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్, గుండె వైద్య నిపుణుడు డాక్టర్ కె.గోపాలకృష్ణ, డైరెక్టర్ కె.శ్రీనివాససాయి నేతృత్వంలో శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఆస్పత్రి కమిటీ ఛైర్మన్ డాక్టర్ వై.రమేష్‌బాబు మాట్లాడుతూ.. ప్రమాదంలో ఉన్న ప్రతిఒక్కరినీ రక్షించే బాధ్యత చుట్టుపక్కల వారికి ఉంటుందని అన్నారు. ఆస్పత్రి హృద్రోగ విభాగాధిపతి డాక్టర్ పి.ఎస్.శ్రీనివాస చౌదరి మాట్లాడుతూ.. బీఎల్ఎస్ శిక్షణ తీసుకుంటే గుండెపోటు వచ్చిన వారికి సీపీఆర్ చేసి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడవచ్చని వివరించారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.ఎల్.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టర్ తరుణ్ చౌదరి, డాక్టర్ పావని శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణకు వచ్చిన వారికి ఆయుష్ స్వాస్థ్య యాప్‌పై అవగాహన కల్పించారు. సీఏవో ఎం.జయలక్ష్మి పర్యవేక్షించగా, 250 మందికి శిక్షణ ఇచ్చారు.



మహిళకు బీఎల్ఎస్ శిక్షణ ఇస్తున్న వైద్యులు

కలెక్టర్ దృష్టికి సమస్యలు

కృష్ణలంక, న్యూస్‌టుడే: ముంపు ప్రాంతాల్లో నష్ట గణన సక్రమంగా జరగనందన మళ్లీ నిర్వహించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య నాయకులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ జి.సృజనకు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వేలాది కుటుంబాలు, వాహనాల నష్టం వివరాలను సిబ్బంది నమోదు చేయలేదని చెప్పారు. ఆటో, స్కూటర్ ఉంటే ఒక దానినే నమోదు చేశారన్నారు. గృహోపకరణాలు కోల్పోయి ఒక్కో కుటుంబం రూ.లక్షల్లో నష్టపోయిందని పేర్కొన్నారు. అద్దె ఇళ్లలో ఉంటున్న వారికి మ్యాపింగ్ లేదన్న కారణంగా పేర్లు నమోదు చేయలేదని, అలాంటి బాధితులు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. వాస్తవ అంచనాలు వేసి నష్టపోయిన ప్రతి కుటుంబానికి, ఆటోలకు పరిహారాన్ని పెంచి ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. వివిధ కారణాలతో వేలాది ఆటోలకు బీమా ఇవ్వడం లేదని తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రవిచంద్ర, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సృజనకు వినతి పత్రాన్ని సమర్పిస్తున్న సంఘం నాయకులు

స్పందనకు వందనం

ప్రమాదాల నివారణకు చర్యలు

కరెన్సీనగర్, విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: కరెన్సీనగర్ నుంచి ఏపీఐఐసీ కాలనీ వరకు ఉన్న హైటెన్షన్ రోడ్డు మార్జిన్‌లో విద్యుత్తు తీగలు, స్తంభాలు తొలగించకుండానే రాళ్లు పరిచారని, పేవర్ బ్లాక్స్ చెదిరిపోయాయని 'మూన్నాళ్ల ముచ్చటే' శీర్షికన 'ఈనాడు'లో ఈ నెల 30న ప్రచురితమైన కథనానికి విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఉన్నతాధికారులు స్పందించారు. ఎస్ఈ మురళీమోహన్, ఏఈలు మురళీకృష్ణ, దుర్గాప్రసాద్ బయటకు కనపడుతున్న తీగలను పరిశీలించారు. కార్పొరేషన్ వీధి దీపాలకు చెందినవిగా గుర్తించారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.



తీగలకు ఏర్పాటు చేసిన రక్షణ పెట్టె

గంజాయి విక్రయిస్తున్న సస్పెక్ట్ షీటర్ అరెస్టు

పటమట, న్యూస్‌టుడే: గంజాయి సరఫరా చేస్తున్న ఓ సస్పెక్ట్ షీటర్‌తో పాటు మరో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. సోమవారం ప్రసాదంపాడులోని వికాస్ స్కూల్ రోడ్డులో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందింది. వారు ఆ స్థలానికి చేరుకుని గంజాయి సరఫరా చేస్తున్న మురళీనగర్‌కు చెందిన సస్పెక్ట్ షీటర్ షేక్ బాషా, రామవరప్పాడుకు చెందిన గరిసేపల్లి సంజయ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 20.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులతో పాటు గంజాయిని పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పటమట పోలీసులు తెలిపారు.

పుస్తకాల అందజేత

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఇటీవల వరద ముంపు కారణంగా దెబ్బతిన్న 27 పాఠశాలల్లో విద్యార్థులకు గురునానక్ కాలనీ గురుద్వారా, ఇన్నర్ వీల్ క్లబ్ విజయవాడ, సన్‌షైన్ సంయుక్త ఆధ్వర్యంలో రాత పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరమ్ కౌర్, పింకీ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బాధితులకు చేయూత అభినందనీయం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: వరద బాధితులకు ఆర్థిక సాయం చేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. గాయత్రినగర్‌కు చెందిన భారతి కిట్టీ పార్టీ తరఫున సీఎం సహాయనిధికి రూ.లక్ష చెక్కును గాయత్రినగర్‌లో సోమవారం ఎమ్మెల్యేకు అందజేశారు. కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, నేతలు సురేష్, ఆర్.మణికుమారి, టి.ఎస్.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న భారతి

విద్యార్థులకు రాత పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న ప్రిన్సిపల్ విజయసారథి తదితరులు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్న తోటి విద్యార్థులకు సాయం చేయడం అభినందనీయమని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.విజయసారథి అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వరద ప్రాంతాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీని సోమవారం కళాశాలలో నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... తాము 200 మంది బాధితులకు సహాయం చేస్తూ 11 కేంద్రాల్లో భోజనాలు ఏర్పాటు చేశామన్నారు. నగర పరిధిలో విద్యార్థులకు 25 వేల రాత పుస్తకాలను అందజేశామని చెప్పారు. నాయకులు కుమార స్వామి, అవినాష్, యోగి, వాసు, హాసిని, హరిప్రియ పాల్గొన్నారు.



బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: విశాఖ జిల్లాలో ఈ నెల 5 నుంచి జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌నకు తమ కళాశాలకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారని పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ చుండి వెంకటేశ్వర్లు తెలిపారు. ఇటీవల నూజివీడులో జరిగిన జిల్లా జట్టు ఎంపిక పోటీలో తమ కళాశాలకు చెందిన పి.కార్తీక్, పి.సురేష్ ప్రతిభను ప్రదర్శించి జట్టులో స్థానం సాధించారని పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో ఎంపికైన క్రీడాకారులను, పీడీ మార్కండేయులును అభినందించారు.

టీటీలో సత్తా చాటిన చిన్నారి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో అయిదో తరగతి చదువుతున్న చిన్నారి శీలం మనస్వి రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ (టీటీ)టోర్నీలో రెండు ట్రోఫీలు కైవసం చేసుకుందని ప్రిన్సిపల్ మేడా సీతారామయ్య తెలిపారు. గత నెల 27 నుంచి మూడు రోజుల పాటు విశాఖలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ టీటీ టోర్నీలో మనస్వి అండర్-11 వ్యక్తిగత విభాగంలో విన్నర్ ట్రోఫీ కైవసం చేసుకోవడంతో పాటు అండర్-13లో తలపడి తృతీయ స్థానం సాధించింది. సోమవారం స్కూల్‌లో మనస్వినిని వైస్ ప్రిన్సిపల్ కె.రోజ్ మేరీ, ప్రధానోపాధ్యాయిని సీహెచ్ జయలక్ష్మి తదితరులు అభినందించారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: పటమట కేబీసీ జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన స్కూల్ గేమ్స్ సమాఖ్య (ఎస్‌జీఎఫ్) అండర్-14, 17 బాలబాలికల అథ్లెటిక్స్ నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు వంద మంది వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించామని నియోజకవర్గ ఎస్‌జీఎఫ్ ఇన్‌ఛార్జి ఎం.రాజకుమార్ తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను నియోజకవర్గ జట్టుకు ఎంపిక చేస్తామని చెప్పారు.

జిల్లా సెపక్ తక్రా జట్టు....

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17, విజయవాడలో జరిగే అండర్-14 బాలబాలికల సెపక్ తక్రా ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపికలు సోమవారం పటమటలోని కేబీసీ జడ్పీహెచ్ స్కూల్‌లో నిర్వహించామని స్కూల్ గేమ్స్ సమాఖ్య కార్యదర్శి దాసరి శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ప్రధానోపాధ్యాయిని జి.ఎస్తేరురాణి, ఎస్ఏ పీఈ ఎల్.దుర్గారావు, పీఈటీ ఎస్.రమేష్ అభినందించారు. అండర్-17 జట్టుకు ఎంపికైన క్రీడాకారుల వివరాలు ఇలా ఉన్నాయి. బాలికల జట్టులో పి.హరిప్రియ, ఎస్‌కే కతిజా బేగం, కె.వెంకట లక్ష్మి, సీహెచ్ రమ్యశ్రీ, వి.దుర్గాభవానీ (కేబీసీ జడ్పీహెచ్ స్కూల్), బాలుర జట్టులో కె.కుషాల్, టి.రూపేష్, టి.వంశీ, ఎస్‌కే ఆరిఫ్, ఎల్.జశ్వంత్ (కేబీసీ జడ్పీహెచ్ స్కూల్, పటమట) చోటు సంపాదించారు.

పారా స్విమ్మింగ్‌లో ప్రతిభ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: విశాఖలో ఈ నెల 29న జరిగిన రాష్ట్ర స్థాయి 6వ పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా స్విమ్మర్లు సత్తా చాటి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ రన్నరప్ ట్రోఫీ కైవసం చేసుకున్నారు. పురుషుల విభాగంలో ఎ.లక్ష్మణరావు మూడు పసిడి, జూనియర్ పురుషుల విభాగంలో మోహిత్ మూడు పసిడి, జితేంద్ర మూడు పసిడి, జూనియర్ మహిళల విభాగంలో సంజన మూడు పసిడి, సబ్ జూనియర్ బాలుర విభాగంలో దేవ శ్రీకర్ పసిడి, కాంస్యం, రఘునందన్ రెండు రజత పతకాలు కైవసం చేసుకున్నారు. వారంతా ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు గోవాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆడతారని కోచ్ లక్ష్మణరావు తెలిపారు.

అంతర్జాతీయ స్కేటర్ ఆర్యాణికి ఎంపీ అభినందన

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగరానికి చెందిన అంతర్జాతీయ స్కేటర్ చేబోయిన ఆర్యాణిని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సోమవారం అభినందించారు. ఆర్యాణి ఇటీవల ఇటలీలో జరిగిన వరల్డ్ స్కేట్ గేమ్స్-2024లో భాగంగా రోలర్ డెర్బీలో భారత మహిళల జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. భారత జట్టు కాంస్యం కైవసం చేసుకుంది. విషయం తెలుసుకున్న ఎంపీ శివనాథ్.. ఆర్యాణిని, శిక్షణనిచ్చిన తండ్రి శివ పరమేశ్వరరావు, తల్లి నాగస్వర్ణను గురునానక్ కాలనీలోని తన కార్యాలయానికి ఆహ్వానించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో ఆస్ట్రేలియా, అమెరికాతో జరిగిన మ్యాచ్‌ల్లో ఆర్యాణి ఉత్తమ క్రీడాకారిణిగా ప్రత్యేక అవార్డు అందుకుంది. శాప్ మాజీ ఛైర్మన్ పోలినేని అంకమ్మచౌదరి, ఫన్ టైమ్స్ ఉపాధ్యక్షురాలు అట్లూరి సుమబిందు, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ శివనాథ్‌తో ఆర్యాణి, ఆమె తల్లిదండ్రులు, అంకమ్మచౌదరి, సుమబిందు

క్రీడలతో శారీరక.. మానసిక ఆరోగ్యం



పోటీలు ప్రారంభిస్తున్న ఏసీపీ రవికిరణ్, ఫిజికల్ డైరెక్టర్లు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని స్థానిక ఏసీపీ రవికిరణ్ పేర్కొన్నారు. సోమవారం నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) నియోజకవర్గ స్థాయి బాలుర ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులతో ఖోఖో ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి క్రీడల్లో సాధన చేయాలని సూచించారు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన మన దేశానికి చెందిన క్రీడాకారులను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా పోటీలు నిర్వహించి జిల్లాస్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ప్రధానోపాధ్యాయిని పి.విజయలక్ష్మి, ఎస్‌జీఎఫ్ పోటీల నియోజకవర్గ కోఆర్డినేటర్ పల్లపు శ్రీనివాసరావు, మండల కో ఆర్డినేటర్ కల్యాణరాజు, ఫిజికల్ డైరెక్టర్లు డి.లక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకొనే వరకు ఆందోళన



నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు, ఏజెన్సీ నిర్వాహకులు

నందిగామ, న్యూస్‌టుడే: రాజకీయ కారణాలతో తొలగించిన మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కార్మికులు 23 ఏళ్లుగా మధ్యాహ్న భోజనం తయారు చేసి పిల్లలకు అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం బిల్లుల చెల్లించడం ఆలస్యమైనా, నిత్యావసర సరకుల ధరలు పెరిగినా... భరిస్తూ ఏజెన్సీ కార్మికులు పని చేశారని గుర్తు చేశారు. కొత్త ప్రభుత్వం రాగానే నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో పలువురు కార్మికులు, శానిటేషన్ వర్కర్లు, వాచ్‌మెన్‌లను విధుల నుంచి తొలగించారని విమర్శించారు. వారిని విధుల్లోకి తీసుకునే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని చెప్పారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపీనాయక్, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. మాగల్లులో గత ఆర్థిక సంవత్సరంలో రూ.65 లక్షల విలువైన పనులు పూర్తి చేశారు. సామాజిక తనిఖీలో భాగంగా పంట కాలువలు పూడుకుపోయినట్లు గుర్తించారు. కొత్తగా మంజూరైన జాబ్‌కార్డులను సర్పంచి గుంటి ఆశాజ్యోతి అర్హులకు పంపిణీ చేశారు. తెదేపా నాయకులు సూరంపల్లి అప్పారావు, చెరుకుమల్లి శేషగిరిరావు, జనసేన పార్టీ నాయకులు కంబాల సాయి, ఎంపీపీ ఆకుల సాయి, ఏపీవో శరత్, ఎస్ఆర్పీ రాజు తదితరులు పాల్గొన్నారు. తొర్రగుడిపాడు, అంబారుపేట, దాములూరు, అడవిరావులపాడు గ్రామాల్లోనూ గ్రామసభలు నిర్వహించారు.

పగిలిన పైపులు.. తాగునీటి వెతలు

నెల రోజులుగా పెనుగంచిప్రోలు వాసుల ఇక్కట్లు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే

పెనుగంచిప్రోలులో సుమారు నెల రోజులుగా ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. ఇటీవల మునేరుకు వచ్చిన భారీ వరదకు ఏటికి అడ్డంగా ఉన్న తాగునీటి పథకం పైపులైన్ ధ్వంసమైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. గ్రామంలో ఉన్న సుమారు 15 వేల మంది జనాభా అవసరాలు తీర్చేందుకు రెండు పథకాలు ఉన్నాయి. వరద తగ్గుముఖం పట్టిన తర్వాత తూర్పు బజారు పథకానికి మరమ్మతులు చేపట్టి సరఫరా పునరుద్ధరించారు. పాత పథకంలోని పైపులు ఏటిలోని ఇసుక తిన్నెల్లో ఉండడంతో వరదకు ధ్వంసమయ్యాయి. విద్యుత్తు లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. వారం రోజుల తర్వాత విద్యుత్తు సరఫరా చేయగా, పంచాయతీ అధికారులు పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు. ఏటిలో నీటి ఉద్ధృతి కొనసాగుతుండటంతో పనులు ఆపేశారు.

ట్యాంకర్లతో సరఫరా

ప్రజల దాహాన్ని తీర్చేందుకు పంచాయతీ అధికారులు ట్యాంకర్లతో నీరందిస్తున్నారు. వడ్డెర కాలనీ, డౌన్‌సెంటర్, శింగవరం డొంకరోడ్డు, మెయిన్ బజార్, తుపాన్ కాలనీ, మోడల్ కాలనీ, చెర్వుకట్ట బజారుకు నిత్యం మూడు ట్రాక్టర్లతో 12 ట్యాంకర్ల తాగునీటిని సరఫరా చేస్తున్నారు. పంచాయతీ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే నీరు శుద్ధంగా లేదంటూ చాలా మంది ప్రజలు స్థానికంగా ఉన్న శుద్ధజల విక్రయ కేంద్రాల వద్ద డబ్బా రూ.20కు కొనుగోలు చేస్తున్నారు. పడమర బజారులోని పలు కాలనీలు, వీధుల్లోని నివాసాల్లో బోర్లు లేకపోవడంతో ఇతర అవసరాలకు చుక్క నీరు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. పలు వీధుల్లోని ఒకటి రెండు కుటుంబాలు కలిసి ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేస్తున్నారు.



ట్యాంకరు వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

☛ మునేరులో ఉన్న పైపులైన్‌కు మరమ్మతులు చేయడం కష్టతరంగా మారినపుడు.. నీటి సరఫరాకు ప్రత్యామ్నాయం ఏమిటని గ్రామస్థులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. నెల రోజులైనా పథకం వైపు కన్నెత్తి చూడకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వరద తగ్గగానే మరమ్మతులు చేపడతాం

మునేరుకు వచ్చిన భారీ వరదకు విద్యుత్తు లైన్లు, ఏటిలో ఉన్న సుమారు కిలోమీటరు మేర పైపులైన్ పూర్తిగా ధ్వంసమైంది. ప్రస్తుతం విద్యుత్తు సరఫరా పునరుద్ధరించాం. తాగునీటి పైపులైన్ మరమ్మతులకు వరద నీరు అడ్డంకిగా మారింది. తగ్గుముఖం పట్టగానే పనులు చేపడతాం.

- శ్యాంకుమార్, పంచాయతీ కార్యదర్శి

గొంతు తడపని బోరు



మండలంలోని కొణతమాత్మకూరు గ్రామ సచివాలయం ఆవరణలో బోరుకు మరమ్మతులు చేయక స్థానికులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. నిరుపయోగంగా ఉన్న బోరుకు కర్రలు కట్టి ఇతర అవసరాలకు ఊతంగా వాడుతున్నారు. పబ్లిక్ కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా కాని రోజుల్లో ఈ బోరు నీరే ఆధారమని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలో రజకవీధి, బస్ షెల్టర్ ప్రదేశాల్లో బోర్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. ఎంపీడీవో పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మెకానిక్‌తో మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

- నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

అంతిమ యాత్రకు అవస్థలే



మండలంలోని దాచవరంలో ఎవరైనా మరణిస్తే అంతిమ యాత్రలో పాల్గొనే వారు ఆపసోపాలు పడాల్సిందే. శ్మశానానికి వెళ్లే దారి పొలాల మధ్య ఉన్న డొంక దారి కావడంతో అంతిమ యాత్ర అనేక ఇబ్బందుల మధ్య నిర్వహించాల్సి వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. వర్షాకాలంలో బురద, గుంతల్లోనే అంతిమయాత్రకు తీసుకెళ్లాల్సి రావడంతో గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- దాచవరం (వీరులపాడు), న్యూస్‌టుడే

మందు బాబులతో ఇబ్బందులు

కంచికచర్ల, న్యూస్‌టుడే: కంచికచర్లలోని ప్రభుత్వ మద్యం దుకాణం స్థానిక జుజ్జూరు రహదారి పక్కనే ఉండడంతో రాత్రి మందు బాబుల ఆగడాలతో గందరగోళ పరిస్థితి నెలకొంటోంది.



కంచికచర్ల-జుజ్జూరు రహదారి పక్కనే తాగుతూ...

మందు బాబులు కొంత మంది రహదారి పక్కనే వాహనాలను అడ్డదిడ్డంగా నిలిపి మద్యం తాగుతూ ఉండడంతో రహదారిపై వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన రహదారి పక్కనే ఇంత తతంగం జరుగుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జాతీయ రహదారి పనులు ముమ్మరం

నందిగామ, న్యూస్‌టుడే

నందిగామ వై కూడలి (జంక్షన్) వద్ద జాతీయ రహదారిపై అండర్ పాస్ వంతెన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై అసంపూర్తిగా ఉన్న రోడ్డు, అప్రోచ్ నిర్మాణ పనులు వేగంగా చేస్తున్నారు. ఇప్పటికే సగానికి పైగా పనులు పూర్తయ్యాయి. నందిగామ వద్ద హైవే బైపాస్‌ను ఆరు వరుసల రోడ్డుగా నిర్మించారు. సుమారు ఏడు కిలోమీటర్ల రోడ్డు నిర్మించగా... రెండేళ్ల నుంచి రాకపోకలు సాగుతున్నాయి. నందిగామ వై కూడలి వద్ద వెహికల్ అండర్ పాస్ నిర్మించారు. ఇరువైపులా 850 మీటర్ల రోడ్డు నిర్మాణ పనులకు భూ సేకరణ సమస్య వచ్చింది. వాటిని పరిష్కరించిన రెవెన్యూ, హైవే అథారిటీ అధికారులు నిర్మాణానికి మార్గం సుగమం చేశారు. హైవేపై వెళ్లే వాహనాలకు ఇబ్బంది కలగకుండా, నందిగామ వైపు వాహనాలు వెళ్లేందుకు అండర్‌పాస్ వంతెన నిర్మించారు. దానికి రెండువైపులా రోడ్డు నిర్మాణం పూర్తయితే వాహనాల రాకపోకలకు వీలుంటుంది. వంతెన ఎత్తు వరకు రోడ్డుకు ఇరువైపులా రిటైనింగ్ గోడ నిర్మించారు. దాని మధ్యలో రోడ్డు నిర్మిస్తున్నారు. మరి కొద్ది నెలల్లో పనులు పూర్తి చేయాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇది అందుబాటులోకి వస్తే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఉండవు.



పనులు చేస్తున్న కార్మికులు, యంత్రాలు

మెరుగైన వైద్యం అందించేందుకు కృషి



మాట్లాడుతున్న శాసనసభ్యుడు తాతయ్య

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే పేదలకు మరింత మెరుగైన వైద్యం అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య అన్నారు. జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రిలో సోమవారం నూతన పాలకవర్గ సమావేశంలో ఛైర్మన్ హోదాలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. వైద్యాధికారులు, అభివృద్ధి కమిటీ సమన్వయంతో సాగుతూ వచ్చిన రోగుల అవసరాలు గుర్తించి తీర్చాలన్నారు. ఆసుపత్రిలో వసతుల కల్పన, అదనపు వైద్య సదుపాయాల కోసం ప్రతిపాదనలు చేయాలని సూచించారు. వైద్యాధికారి హరీష్, అభివృద్ధి కమిటీ సభ్యులు వెంకటలక్ష్మి, కుటుంబరావు, నాగేశ్వరరావులు, నాయకులు రాధ తదితరులు ఉన్నారు.

నాణ్యమైన బోధనతోనే విద్యార్థుల ప్రగతి



కార్యక్రమానికి హాజరైన అధ్యాపకులు

పరిటాల (కంచికచర్ల), న్యూస్‌టుడే: అధ్యాపకులు నిత్య విద్యార్థులుగా ఉన్నప్పుడే బోధనలో నాణ్యత ఉంటుందని, విద్యార్థులు ప్రగతి సాధించడానికి అవకాశం కలుగుతుందని టెక్ మహీంద్ర సౌత్ ఇండియా హెచ్ఆర్ హెడ్ శ్రీనివాసరెడ్డి అన్నారు. ఏఐసీటీఈ-ఏటీఏఎల్‌ల సహకారంతో అమ్రిత సాయి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులను ఆకట్టుకునేలా అధ్యాపకులు బోధన చేయాలని, ఇటువంటి కార్యక్రమాల ద్వారా నూతన సాంకేతిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.రామ్మోహనరావు, ప్రిన్సిపల్ ఎం.శశిధర్, ఎఫ్‌డీపీ సమన్వయకర్త జి.విజయ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ దుర్గానగర్ కనకదుర్గమ్మ ఆలయంలో అక్టోబరు 3 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు మనబోతుల శ్రీరామ సోమవారం తెలిపారు. 9 రోజుల పాటు అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిస్తుందని చెప్పారు. ఇప్పటికే భక్తుల కోసం ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం



నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: రాఘవాపురం ఎస్టీ కాలనీలో విద్యుత్తు తీగలకు పిచ్చితీగ అల్లుకుని సరఫరాకు అంతరాయం కలుగుతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. బలంగా గాలి వీచినప్పుడల్లా సింగిల్‌ఫేజ్ విద్యుత్తు నియంత్రికలో సాంకేతిక సమస్య ఏర్పడి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని, లైన్‌మెన్ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూరల్ విద్యుత్తు ఏఈ రామకృష్ణ వివరణ కోరగా సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

నిత్యావసర ధరలు నియంత్రించండి

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఆకాశాన్నంటిన నిత్యావసర సరకుల ధరలను రాష్ట్ర ప్రభుత్వం నియంత్రించాలని సామాజిక కార్యకర్త మెటికల శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని చిల్లకల్లు గ్రామ మండల పరిషత్తు కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం ఆయన వినతిపత్రం అందించారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

కంచికచర్ల, న్యూస్‌టుడే: కంచికచర్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా అఫ్షపున్నీసా బేగం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ జిల్లా సామర్లకోట నుంచి ఆమె ఇక్కడికి వచ్చారు.

దివ్యాంగుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని దివ్యాంగులకు అందాల్సిన వసతులు, వారికి ఉన్న హక్కుల విషయమై అధికారులు శ్రద్ధ చూపాలని నియోజకవర్గ దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు వడ్డెపూడి ఉమామహేశ్వరరావు కలెక్టర్‌కి విన్నవించారు. దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, నివేశిత స్థలాలు, గృహాల ఏర్పాటు తదితర అంశాలను ఆయన అర్జీలో పేర్కొన్నారు.

జనసేనలో చేరిక

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సమక్షంలో పట్టణంలోని వ్యాపార ప్రముఖులు గెల్లా పూర్ణ, ఎంపీటీసీ సభ్యులు నార్ల సుధకర్ రెడ్డి, పనితి గోపాలకృష్ణ వైకాపాను వీడి జనసేనలో చేరారు. నాయకులు మాదాల వీరయ్యచౌదరి, అనంత శ్రీనివాస్, తునికిపాటి శివలు జనసేనలో చేరినవారిలో ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: తోటచర్లలో మునేటి నుంచి తరలించిన ఇసుకను అక్రమంగా డంపింగ్ చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేసి యజమానులు తోటచర్లకు చెందిన ఇమ్మడి రమేష్, తానూరి శివలపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పల్లెలు శుభ్రంగా.. వ్యర్థాలు రాబడిగా

కంచికచర్ల, న్యూస్‌టుడే



నిరుపయోగంగా కంచికచర్ల చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం

చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలను కూటమి ప్రభుత్వం మళ్లీ పట్టాలెక్కించనుంది. గ్రామాలు శుభ్రంగా ఉంచడంతో పాటు వ్యర్థాల నుంచి పంచాయతీలకు ఆదాయం వచ్చేలా చేయనుంది.

వాస్తవానికి 2014-19 మధ్య కాలంలో తెదేపా ప్రభుత్వం ఘన వ్యర్థాల నిర్వహణకు ప్రతి పంచాయతీ పరిధిలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలను నెలకొల్పింది. గ్రామాల్లో సేకరించిన వ్యర్థాలను కేంద్రాల్లో వేరు చేసి తడి చెత్తతో వర్మీ కంపోస్టు తయారు చేసి విక్రయించి ఆదాయం పొందాలని ప్రణాళిక రూపొందించింది. సుమారు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వ్యయంతో గ్రామాల్లో షెడ్లు నిర్మించింది. చెత్త సేకరణకు రిక్షాలు ఇచ్చింది.

☛ తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం కేంద్రాలను పట్టించుకోలేదు. రిక్షాలు నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో అపరిశుభ్రత నెలకొంది. సేకరించిన చెత్తను గ్రామ శివారులో పోయడం, నిప్పు పెట్టడం వంటి చర్యలతో గత పాలకులు కాలం గడిపేశారు. ఆయా కేంద్రాలు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారాయి.

అందుబాటులోకి తేవాలని..

☛ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సంపద సృష్టి కేంద్రాల అంశం తెర మీదకు వచ్చింది. గ్రామాల్లో పారిశుద్ధ్యం సక్రమ నిర్వహణకు కేంద్రాలను వచ్చే నెల 2వ తేదీ నుంచి ఉపయోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 17 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

నందిగామ నియోజకవర్గంలో సంపద సృష్టి కేంద్రాల వివరాలు

మండలం	పంచాయతీలు	నిర్మించిన షెడ్లు	షెడ్లు లేనివి
చందర్లపాడు	18	17	1
కంచికచర్ల	16	13	3
నందిగామ	23	23	0
వీరులపాడు	22	22	0

☛ ప్రధాన కూడళ్లు, ప్రజోపయోగ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల, పాఠశాల భవనాల వద్ద చెత్త, మురుగు తొలగించడం

☛ ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో శ్రమదానం చేయడం

☛ స్వచ్ఛతపై పాఠశాల విద్యార్థులకు క్విజ్ తదితర పోటీల నిర్వహణ

☛ ఇళ్ల నుంచి తడి, పొడి చెత్త సేకరించి సంపద తయారీ కేంద్రంలో వేరు చేసి సేంద్రియ ఎరువుగా మార్చడం

☛ చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలను వినియోగానికి అనువుగా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించింది.

జనార్దన్‌కు నివాళి



సంకా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నెట్టెం, తాతయ్య తదితరులు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేటలో రాజకీయ ప్రముఖుడు సంకా జనార్దన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్యలు పాల్గొని నివాళులర్పించారు. అనంతరం అన్నక్యాంటీన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన జ్ఞాపకార్థం కుమారులు సంకా వెంకట్రావ్, భాస్కరరావులు రూ.10 వేలు అన్నదాన ట్రస్ట్‌కి విరాళంగా అందించారు.

కొనకళ్లకు సన్మానం

ఆటోనగర్, న్యూస్‌టుడే: ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమితులైన తెదేపా కృష్ణా జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావును మంగళవారం ఆటోనగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం అభినందనలు తెలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ.. తెదేపా బలోపేతం కోసం అంకితభావంతో పని చేసిన కొనకళ్ల నారాయణకు సీఎం చంద్రబాబు తగిన గౌరవం ఇచ్చారన్నారు. పార్టీలో కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యం ఉంటుందనే విషయం రుజువైందని పేర్కొన్నారు. నాయకులు వాసం మునియ్య, యేదుపాటి రామయ్య, సారేపల్లి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతి

వత్సవాయి, న్యూస్‌టుడే: మక్కపేటకు చెందిన గుడేటి రాజా (35) సోమవారం రాత్రి ద్విచక్రవాహనంపై చిల్లకల్లు వెళ్తు ప్రమాదానికి గురై మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం.. బైక్‌పై నుంచి పడిపోయి ఉన్న అతడిని స్థానికులు 108 ద్వారా విజయవాడకు తరలించారు. మార్గం మధ్యలో మృతిచెందడంతో మృతదేహాన్ని జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయంపై తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అయిదుగురికి ఏడాది జైలు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: గౌరవరం గ్రామంలో 2021వ సంవత్సరంలో జరిగిన ఘర్షణలో నిందితులకు జగ్గయ్యపేట కోర్టు న్యాయమూర్తి ఎం.శోభారాణి ఒక సంవత్సరం జైలు శిక్ష విధించారు. పోలీసుల కథనం ప్రకారం.. గుంజ గురుస్వామి తన కుటుంబ సభ్యులను కొట్టిన పలువురిపై 2021లో చిల్లకల్లు పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టగా.. అప్పటి ఎస్ఐ జి.మహాలక్ష్మణుడు కేసు నమోదు చేసి జగ్గయ్యపేట కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి.. ముద్దాయిలైన వల్లెపు సాయికృష్ణ, వాణి, రాంబాబు, వెంకటేశ్వర్లు, నాగలక్ష్మిలకు ఏడాది జైలుశిక్ష విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించారు. ఈ కేసు విషయంలో ఏపీపీ ఎన్.ప్రగతి, ఎస్ఐ సూర్యశ్రీనివాస్, కోర్టు కానిస్టేబుల్ సీహెచ్.సత్యనారాయణ సహకరించారు.

కార్మికుల బకాయిలు చెల్లించాలి

జగ్గయ్యపేట: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వేతన కార్మికులుగా పని చేస్తున్నవారికి నాలుగు నెలలుగా బకాయిలు చెల్లించకుండా గుత్తేదారు చేస్తున్న జాప్యాన్ని అరికట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సోమేశ్వరారావు సోమవారం డీఆర్వో శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. వేతనాలు చెల్లించకపోగా సెలవు పెడితే రూ.500 కోత విధించడం ద్వారా చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. కమల, దుర్గారావు తదితరులు ఉన్నారు.

ప్రధానోపాధ్యాయినికి సత్కారం



శనగపాడు ఎల్ఎఫ్ఎల్ పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎస్వీఎం కుమారికి సోమవారం జరిగిన పదవీ విరమణ కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్రనాయక్ పాల్గొని సత్కరించారు. ఎస్ఎంసీ ఛైర్మన్ కోట సురేష్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పాల్‌రాజ్, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

- పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే

రహదారికి మరమ్మతులు చేపట్టండి



లింగాల వద్ద వాహనదారుల అవస్థలు

వత్సవాయి, న్యూస్‌టుడే: లింగాల వద్ద రహదారి గోతులమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల మునేరుకు వచ్చిన భారీ వరదకు లింగాల వంతెన, రహదారి పూర్తిగా దెబ్బతిన్నాయి. మునేరు కాలువ సమీపంలో ఏర్పడిన భారీ గుంతల్లో ఇటీవల కారు, ఆటో ప్రమాదాలకు గురయ్యాయి. అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేసినా ఇంకా పలుచోట్ల గోతులు ఉండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్ అండ్‌బీ అధికారులు వెంటనే మరమ్మతులు చేయించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

విజయవాడ పశ్చిమ

సమస్యల పరిష్కారానికి కృషి


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర


భవానీపురం, న్యూస్‌టుడే : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో తెలిపే ప్రతి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వివిధ శాఖల అధికారుల సమన్వయంతో సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని, సంతృప్తికరమైన పరిష్కారం వచ్చిన తర్వాతనే ఆ ఫిర్యాదును క్లోజ్ చేయడం జరుగుతుందన్నారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో 15 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి 10, ఇంజినీరింగ్ విభాగం 3, రెవెన్యూ, యూసీడీకి ఒక్కో సమస్య వచ్చినట్లు చెప్పారు.

దేవీ శరన్నవరాత్రులు ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

చిట్టినగర్, న్యూస్‌టుడే : స్థానిక నగరాల సీతారామ స్వామి మహాలక్ష్మి(కొత్త) అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ అధ్యక్ష, కార్యదర్శి లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు తెలిపారు. చిట్టినగర్‌లోని మహాలక్ష్మి కల్యాణ మండపంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పది రోజుల పాటు జరిగే ఉత్సవాలను పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రారంభిస్తారని చెప్పారు. ఆలయ కమిటీ కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు దేవాలయ ప్రాంగణంలో సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు పది రోజుల పాటు జరుగుతాయన్నారు. అనంతరం ఉత్సవాలకు సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. బెవర సూర్యనారాయణ, దుర్గాప్రసాద్, శీరం వెంకట్రావు, పణుకు రమ, తమ్మిన సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు నిర్ణయంపై హర్షం


ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడుతున్న శంకరరావు

భవానీపురం, న్యూస్‌టుడే : మాజీ సైనికుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం వల్ల తమకు మేలు జరుగుతుందని రాష్ట్ర మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మోటూరి శంకరరావు అన్నారు. కార్పొరేషన్‌ను ఏర్పాటు ప్రకటనపై సచివాలయంలో సీఎం చంద్రబాబును మాజీ సైనికులు సోమవారం కలిసి ధన్యవాదాలు తెలిపారు. శంకరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్మీ, నావికాదళం, ఎయిర్‌ఫోర్స్‌లో లక్షా పదివేల కుటుంబాలు ఉన్నాయని వెల్లడించారు. గత ప్రభుత్వాలు సైనికుల సమస్యలను పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ప్రకటన చేయడం సంతోషకరమన్నారు. సంఘం కార్యదర్శి వై.రమేష్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళం


మంత్రి లోకేశ్‌కు విరాళం ఇస్తున్న సభ్యులు

వరద బాధితులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.7లక్షల 86 వేలను మంత్రి నారా లోకేశ్‌కు ఏపీ వక్ఫ్ ఇనిస్టిట్యూషన్స్, ముతవల్లీస్ అండ్ మేనేజింగ్ కమిటీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అందజేశారు. ఉండవల్లిలోని ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేశ్‌ను కలిసి చెక్కును సోమవారం అందించారు. సభ్యులు పెనుగొండ దర్గా రాజ్ బాబా, అత్త నిజాముద్దీన్ నిజాం బాబా, షకీల్ షఫీ, ఎస్ఎం.ఫైజాన్ పాల్గొన్నారు.

ఉత్సవ కళ.. ఘాట్లు తళతళ


మెట్లను నీటితో కడుగుతున్న సిబ్బంది


పరిశుభ్రంగా భవానీఘాట్

కృష్ణా నది తీరం.. కొత్తరూపు సంతరించుకుంటోంది. ఇటీవల కురిసిన వర్షాలకు కృష్ణమ్మ ఉవ్వెత్తున ప్రవహించడంతో పున్నమి, భవానీ స్నానఘాట్లు రూపురేఖలు కోల్పోయాయి. దసరా నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో స్నానఘాట్లను అభివృద్ధి చేస్తున్నారు. భక్తుల రాకను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులతో పరిసరాలను శుభ్రం చేయిస్తున్నారు.
- న్యూస్‌టుడే, భవానీపురం


తాత్కాలిక మరుగుదొడ్లు సిద్ధం


జల్లు స్నానానికి ఏర్పాట్లు...

జగన్మాత సేవలో హీరో కార్తీ



ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను సినీ నటుడు కార్తీ సోమవారం దర్శించుకున్నారు. ఆయనతో పాటు ‘సత్యం సుందరం’ చిత్ర బృందం అమ్మవారి దర్శనానికి వచ్చారు. దేవస్థానం సిబ్బంది వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆయనతో పాటు దర్శకుడు ప్రేమ్ కుమార్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. వేద పండితులు వారికి ఆశీర్వచనం చేసి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. దేవస్థానం ఉద్యోగులు, దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు కార్తీతో సెల్ఫీలు దిగారు. -న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

విద్యాధరపురం, న్యూస్‌టుడే : రామరాజ్యనగర్ సెక్షనులోని 11 కేవీ కన్యకాపరమేశ్వరి ఫీడర్ పరిధిలోని విద్యుత్తు లైన్లు మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ ఈఈ రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుప్తాసెంటరు, కౌస్తుభ అపార్టుమెంట్, అండిమాని బ్రహ్మయ్య వీధి, లొల్లా వారి వీధి తదితర ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. వినియోగదారులు ఆ సమయంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

వరద బాధితులకు చేయూత


మహిళకు సరకులు అందిస్తున్న సుబ్బారావు

భవానీపురం, న్యూస్‌టుడే : భవానీపురం 41వ డివిజన్ హరిజనవాడలోని వరద బాధితులకు సుజనా ఫౌండేషన్ సహకారంతో నిత్యావసర సరకులను సోమవారం అందజేశారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి సూచనల మేరకు 600 కుటుంబాలకు అందించినట్లు బొమ్మసాని సుబ్బారావు తెలిపారు.

*వరద కారణంగా నష్టపోయిన కార్మికురాలు చిన్నమ్మకు ది సిటిజన్ కో- ఆపరేటివ్ సొసైటీ ఉద్యోగులు రూ.20 వేలు అందజేశారు. భవానీపురంలోని కార్యాలయంలో ఆ మొత్తాన్ని ఇచ్చారు. సొసైటీ ఆర్ఎం రంగభాష్యం, మేనేజర్ అనురాధ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛంద భాగస్వామ్యం ప్రశంసనీయం


సత్కారం అందుకున్న ఉపాధ్యాయులతో హెచ్ఎం కోటయ్య

విద్యాధరపురం, న్యూస్‌టుడే : స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో స్వచ్ఛంద భాగస్వామ్యం ప్రశంసనీయమని డీఎస్ఎం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోటయ్య అన్నారు. గట్టువెనక ప్రాంతంలో దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో విశిష్ట సేవలు అందించిన ఉపాధ్యాయులు మరియదాసు, లక్ష్మి, అబీదలను సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు మరళీప్రసాద్, విజయలక్ష్మి, కొండలరావు, రత్నబాబు పాల్గొన్నారు.

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న నారాయణరావు

చిట్టినగర్, న్యూస్‌టుడే : విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగడానికి శ్రమించాలని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ ఏవో వి.నారాయణరావు అన్నారు. కొత్తపేట కేబీఎన్ కళాశాలలో డిగ్రీలో కొత్తగా చేరిన విద్యార్థులకు దీక్షరంబ్ పేరుతో పరిచయ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సుమారు ఆరు దశాబ్దాల సుదీర్ఘ చరిత్ర కలిగిన విద్యాసంస్థగా కేబీఎన్ కళాశాల నిలిచిందని చెప్పారు. ప్రిన్సిపల్ కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపల్ పీఎల్.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు సాయం

చిట్టినగర్, న్యూస్‌టుడే : 47వ డివిజన్ టైనర్‌పేటలోని కొత్తపల్లి జోసెఫ్(57) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. వారికి ఇద్దరు కుమార్తెలు. కొన్నేళ్ల కిందట తల్లి మృతి చెందగా, ఇద్దరు పిల్లలు తల్లిదండ్రులు లేనివారిగా మిగిలారని పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది చెప్పారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే సుజనా చౌదరి సహకారంతో సోమవారం రూ.10 వేలు సాయంతో పాటు బియ్యం అందించినట్లు వారు తెలిపారు. 49వ డివిజన్ ఫైజర్‌పేటకు చెందిన కోమరాబత్తిన కోటమ్మ(50) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబానికి ఆర్థిక సాయం ఇచ్చినట్లు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
భవానీపురం: 80085 74638

? పూర్ణానందంపేటలో డ్రైనేజీ కాలువలు శిథిలావస్థకు చేరాయి. వాటి స్థానంలో కొత్తవి నిర్మించకుండా వాటిపైనే సీసీ రోడ్లు నిర్మించడంతో కాలువల్లో మురుగు ఎక్కడికక్కడే నిలిచిపోయి ఇబ్బంది పడుతున్నాం. **- దుర్గాప్రసాద్, వ్యాపారి**

✔ పరిశీలించి త్వరలోనే మరమ్మతులు చేయిస్తాం. **- డివిజన్ శానిటరీ అధికారి**

- న్యూస్‌టుడే, పూర్ణానందంపేట

సమస్య సున్నితం.. పరిష్కరిస్తే సంతోషం

మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ప్రజల వినతి

చిట్టినగర్, న్యూస్‌టుడే

పరిసరాల పరిశుభ్రత, విజయవాడను వ్యర్థాల రహిత నగరంగా తీర్చిదిద్దాలని ప్రజల్లో అవగాహన కోసం అనేక కార్యక్రమాలు, ప్రచారాలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం పరిశుభ్రత అధికారులకు పట్టడం లేదు. మల మూత్ర విసర్జన బహిరంగంగా చేయకూడదని హెచ్చరికలు ఉన్నాయి. కానీ వాటి విషయంలో కూడా నిర్లక్ష్యం వహిస్తున్నారు. సాయిరాం థియేటర్ సెంటర్, కబేళా సెంటర్, విద్యాధరపురం కూడలి, జోజినగర్ సెంటర్ తదితర ప్రధాన ప్రాంతాల్లో మరుగుదొడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను ఎవరికి చెప్పుకోలేక సతమతమవుతున్నారు. పాలకులు, అధికారులు మాత్రం వాటి ఏర్పాటు విషయంలో పెడచెవిన పెడుతున్నారనే ఆవేదనను ప్రజలు ‘న్యూస్‌టుడే’తో ఇలా వ్యక్తం చేస్తున్నారు.


సాయిరాం థియేటర్ సెంటర్

పాలకులు దృష్టి పెట్టాలి



పశ్చిమంలోని సాయిరాం థియేటర్ సెంటర్ ప్రధానమైంది. ఆ ప్రాంతం నగర మేయర్ డివిజన్ పరిధిలో ఉంది. ఈ కూడలిలో నాలుగు సినిమా థియేటర్లు ఉన్నాయి. ప్రజలు వివిధ పనులపై నగరంలోకి వెళ్లేందుకు ఆటోలు, బస్సుల కోసం ఈ సెంటర్‌కి వస్తుంటారు. అంతటి ప్రాధాన్యం ఉన్న ప్రాంతంలో మరుగుదొడ్లు లేవు. దీంతో సినిమాలకు వచ్చే వారు, ఇతర జనం బహిరంగంగానే మూత్ర విసర్జన చేయాల్సిన దుస్థితి నెలకొంది. మరుగుదొడ్లు నిర్మించేందుకు పాలకులు దృష్టి పెట్టాలని మనవి. **-ప్రవీణ్, లంబాడీపేట**

ముక్కులు పగిలిపోతున్నాయ్



సాయిరాం థియేటర్ ప్రధాన రహదారి నుంచి సౌమ్య థియేటర్ వెనుక భాగం రాజీవ్‌శర్మనగర్ ఉంది. ఆ ప్రాంతంలో సుమారు 2 వేల మంది జనాభా ఉన్నారు. వారంతా ప్రధాన రహదారికి రావాలంటే సౌమ్య థియేటర్ పక్క వీధి నుంచి రావాలి. మూత్రశాలలు లేకపోవడంతో బహిరంగంగానే మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో అటుగా రాకపోకలు సాగించే మహిళలు, యువతులు తల దించుకోవాల్సిందే. బ్లీచింగ్ వేసినా అక్కడి పరిస్థితి మామూలే. కనీసం మూత్రశాలలు ఏర్పాటు చేయాలి. **- ఆంజనేయులు, సిండికేటు బ్యాంకు కాలనీ**

విపత్తు సాయం రూ.7,600 కోట్లు విడుదల చేయండి

కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : కృష్ణా నది, బుడమేరు వరదల్లో విజయవాడ నగరానికి తీవ్రమైన నష్టం వాటిల్లి నెల రోజులైందని.. మోదీ ప్రభుత్వం జాతీయ విపత్తు నిధి నుంచి ఒక్క రూపాయైనా విడుదల చేయకపోవడం శోచనీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన విజయవాడలో విలేకర్లతో మాట్లాడారు. వరదల్లో రూ.7,600 కోట్ల నష్టం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం నివేదిక పంపిందని గుర్తు చేశారు. 74 మంది మృతి చెందారని, 5 లక్షల ఎకరాల్లో పంట నష్టం, వేలాది కిలోమీటర్ల మేర రోడ్లు నాశనమయ్యాయని వివరించారు. కేంద్ర వ్యవసాయశాఖా మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, కేంద్ర అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారని చెప్పారు. జాతీయ విపత్తు కింద రూ.7,600 కోట్లు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు మాట్లాడుతూ.. 18వ రాజ్యాంగ సవరణ చేసి దేశమంతటా ఒకేసారి ఎన్నికలు జరపాలని నిర్ణయించడం తుగ్లక్ నిర్ణయమని విమర్శించారు. ఇది ఆచరణ సాధ్యం కాదని, క్రమంగా ఇది నియంతృత్వానికి దారితీస్తుందన్నారు. సమాఖ్య వ్యవస్థకు విఘాతమన్నారు. ఎన్నికల ఖర్చు తగ్గుతుందని, అభివృద్ధి పరుగులు తీస్తుందనడం అవివేకమని విమర్శించారు.

హైమాస్ట్ దీపం ఏర్పాటుకు చర్యలు


స్తంభానికి మరమ్మతులు చేస్తున్న కార్మికులు

భవానీపురం, న్యూస్‌టుడే : కృష్ణానది ఒడ్డున హైమాస్ట్ దీపం ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు కృష్ణానదికి వరద నీరు రావడంతో స్తంభం కూలిపోయింది. ప్రస్తుతం దసరా ఉత్సవాల నేపథ్యంలో నదీతీరం పక్కన వెలుగు కోసం పడిపోయిన స్తంభాన్ని పైకి లేపి దీపాలు వెలిగించనున్నారు. ఈ నేపథ్యంలో కార్మికులు సోమవారం మరమ్మతు పనులు చేపట్టారు.

బేసిక్ లైఫ్ సపోర్టుపై శిక్షణ



మహిళకు బీఎల్ఎస్ శిక్షణ ఇస్తున్న వైద్యురాలు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఆయుష్ హాస్పిటల్‌లో ప్రజలకు బేసిక్ లైఫ్ సపోర్టు(బీఎల్ఎస్)పై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్, గుండె వైద్య నిపుణుడు డాక్టర్ కె.గోపాలకృష్ణ, డైరెక్టర్ కె.శ్రీనివాససాయి నేతృత్వంలో శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఆస్పత్రి కమిటీ ఛైర్మన్ డాక్టర్ వై.రమేష్‌బాబు మాట్లాడుతూ.. ప్రమాదంలో ఉన్న ప్రతిఒక్కరినీ రక్షించే బాధ్యత చుట్టుపక్కల వారికి ఉంటుందని అన్నారు. ఆస్పత్రి హృద్రోగ విభాగాధిపతి డాక్టర్ పి.ఎస్.శ్రీనివాస చౌదరి మాట్లాడుతూ.. బీఎల్ఎస్ శిక్షణ తీసుకుంటే గుండెపోటు వచ్చిన వారికి సీపీఆర్ చేసి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడవచ్చని వివరించారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.ఎల్.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టర్ తరుణ్ చౌదరి, డాక్టర్ పావని శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణకు వచ్చిన వారికి ఆయుష్ స్వాస్థ్య యాప్‌పై అవగాహన కల్పించారు. సీఏవో ఎం.జయలక్ష్మి పర్యవేక్షించగా, 250 మందికి శిక్షణ ఇచ్చారు.

రాష్ట్ర స్థాయి పారా స్విమ్మింగ్ పోటీల్లో సత్తా


అతిథి నుంచి ట్రోఫీ అందుకుంటున్న జిల్లా పారా స్విమ్మర్లు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: విశాఖలో ఈ నెల 29న జరిగిన రాష్ట్ర స్థాయి 6వ పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా స్విమ్మర్లు సత్తా చాటి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ రన్నరప్ ట్రోఫీ కైవసం చేసుకున్నారు. పురుషుల విభాగంలో ఎ.లక్ష్మణరావు మూడు పసిడి, జూనియర్ పురుషుల విభాగంలో మోహిత్ మూడు పసిడి, జితేంద్ర మూడు పసిడి, జూనియర్ మహిళల విభాగంలో సంజన మూడు పసిడి, సబ్ జూనియర్ బాలుర విభాగంలో దేవ శ్రీకర్ పసిడి, కాంస్యం, రఘునందన్ రెండు రజత పతకాలు కైవసం చేసుకున్నారు. వారంతా ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు గోవాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆడతారని కోచ్ లక్ష్మణరావు తెలిపారు.

రేపు మాంసం దుకాణాలకు సెలవు

భవానీపురం : గాంధీ జయంతిని పురస్కరించుకుని కబేళా, చేపల మార్కెట్లు, మాంసం దుకాణాలకు బుధవారం సెలవు ప్రకటిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా అనుమతి లేకుండా జీవాలను వధించడం, దుకాణాలను తెరిచి మాంసం విక్రయాలను చేసినట్లయితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టీటీలో సత్తా చాటిన చిన్నారి

విజయవాడ క్రీడలు : స్థానిక వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో అయిదో తరగతి చదువుతున్న చిన్నారి శీలం మనస్వి రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ (టీటీ)టోర్నీలో రెండు ట్రోఫీలు కైవసం చేసుకుందని ప్రిన్సిపల్ మేడా సీతారామయ్య తెలిపారు. గత నెల 27 నుంచి మూడు రోజుల పాటు విశాఖలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ టీటీ టోర్నీలో మనస్వి అండర్-11 వ్యక్తిగత విభాగంలో విన్నర్ ట్రోఫీ కైవసం చేసుకోవడంతో పాటు అండర్-13లో తలపడి తృతీయ స్థానం సాధించింది.

సెపక్ తక్రా జిల్లా జట్టు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో ఎస్తేరురాణి, శ్రీనివాసరావు, దుర్గారావు, రమేష్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17, విజయవాడలో జరిగే అండర్-14 బాలబాలికల సెపక్ తక్రా ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపికలు సోమవారం పటమటలోని కేబీసీ జడ్పీహెచ్ స్కూల్‌లో నిర్వహించామని స్కూల్ గేమ్స్ సమాఖ్య కార్యదర్శి దాసరి శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ప్రధానోపాధ్యాయిని జి.ఎస్తేరురాణి, ఎస్ఏ పీఈ ఎల్.దుర్గారావు, పీఈటీ ఎస్.రమేష్ అభినందించారు. అండర్-17 జట్టుకు ఎంపికైన క్రీడాకారుల వివరాలు ఇలా ఉన్నాయి. బాలికల జట్టులో పి.హరిప్రియ, ఎస్‌కే కతిజా బేగం, కె.వెంకట లక్ష్మి, సీహెచ్ రమ్యశ్రీ, వి.దుర్గాభవానీ (కేబీసీ జడ్పీహెచ్ స్కూల్), బాలుర జట్టులో కె.కుషాల్, టి.రూపేష్, టి.వంశీ, ఎస్‌కే ఆరిఫ్, ఎల్.జశ్వంత్ (కేబీసీ జడ్పీహెచ్ స్కూల్, పటమట) చోటు సంపాదించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ బలవన్మరణం

చిట్టినగర్, న్యూస్‌టుడే : ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆటో డ్రైవర్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వైఎస్ఆర్ కాలనీలో తూనుకుంట్ల శ్రీనివాస్(46), విజయ సంగీత దంపతులు ఉంటున్నారు. వారికి ఇద్దరు ఆడపిల్లలు. హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నారు. శ్రీనివాస్ ఆటో డ్రైవర్. అతనికి మద్యం తాగే అలవాటు ఉంది. ఐదు రోజుల కిందట వరద ముంపు డబ్బులు వచ్చాయని ఇమ్మని భార్యను ఒత్తిడి చేశాడు. నగదు రాలేదని చెప్పగా ఆ విషయమై భార్యభర్తలు గొడవ పడ్డారు. సెప్టెంబరు 29న వరద ముంపు నష్ట నివారణ రాసుకుంటున్నారని తెలిసి భార్య బయటకు వెళ్లింది. ఆ సమయంలో భర్త పూటుగా మద్యం తాగి ఉన్నాడు. ఆ మత్తు దిగిన అనంతరం వెళదామని ఆమె తన మేనత్త ఇంటికి వెళ్లింది. రాత్రి ఇంటికి వచ్చే సరికి శ్రీనివాస్ లోపలి గదిలో ఫ్యాన్ హుక్‌కి చీరతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. చుట్టుపక్కల వారి సాయంతో కిందకి దింపారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల తన భర్త చనిపోయినట్లు భార్య కొత్తపేట పోలీసులు ఫిర్యాదు చేసింది. మృత దేహానికి పంచనామా అనంతరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

చిట్టినగర్, న్యూస్‌టుడే : ఇద్దరు గంజాయి విక్రతలను కొత్తపేట పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వైఎస్ఆర్ కాలనీకి చెందిన పెంటుపోని దుర్గప్రసాద్ అలియాస్ జస్టిన్(23), షేక్ రెహమాన్(21) కాలనీ సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు సీఐ చిన కొండలరావుకు సమాచారం అందింది. ఈ మేరకు వారిద్దర్ని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 3.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుల్ని అరెస్టు చేసినట్లు తెలిపారు.

అంతర్జాతీయ స్కేటర్ ఆర్యాణికి అభినందన


ఆర్యాణిని అభినందిస్తున్న ఎంపీ శివనాథ్, పక్కనే తల్లిదండ్రులు, అంకమ్మచౌదరి, సుమబిందు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగరానికి చెందిన అంతర్జాతీయ స్కేటర్ చేబోయిన ఆర్యాణిని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సోమవారం అభినందించారు. ఆర్యాణి ఇటీవల ఇటలీలో జరిగిన వరల్డ్ స్కేట్ గేమ్స్-2024లో భాగంగా రోలర్ డెర్బీలో భారత మహిళల జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. భారత జట్టు కాంస్యం కైవసం చేసుకుంది. విషయం తెలుసుకున్న ఎంపీ శివనాథ్.. ఆర్యాణిని, శిక్షణనిచ్చిన తండ్రి శివ పరమేశ్వరరావు, తల్లి నాగస్వర్ణను గురునానక్ కాలనీలోని తన కార్యాలయానికి ఆహ్వానించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో ఆస్ట్రేలియా, అమెరికాతో జరిగిన మ్యాచ్‌ల్లో ఆర్యాణి ఉత్తమ క్రీడాకారిణిగా ప్రత్యేక అవార్డు అందుకుంది. శాప్ మాజీ ఛైర్మన్ పోలినేని అంకమ్మచౌదరి, ఫన్ టైమ్స్ ఉపాధ్యక్షురాలు అట్లూరి సుమబిందు తదితరులు పాల్గొన్నారు.



? ఆంధ్రప్రభ కాలనీ, తోటవారి వీధిలో రోడ్డు నెంబరు 10లో డ్రైనేజీ నీరు పొంగుతోంది. రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉంది. అపార్ట్‌మెంట్ పక్కనే ఖాళీ స్థలంలో మురుగు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. - కృష్ణకుమారి, స్థానికురాలు

✔ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. - వి.రామకోటేశ్వరరావు, ఏఎంవోహెచ్, వీఎంసీ

మాంసం దుకాణాలకు సెలవు రేపు

భవానీపురం: గాంధీ జయంతి పురస్కరించుకుని కబేళా, చేపల మార్కెట్లు, మాంసం దుకాణాలకు సెలవు ప్రకటిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా అనుమతి లేకుండా జీవాలను వధించడం, దుకాణాలను తెరిచి మాంసం విక్రయాలను చేసినట్లయితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేయాలని కోరారు. - సీతారాంపురం, న్యూస్‌టుడే

విజయవాడ మధ్య

అలరించిన సంగీత విభావరి

గాంధీనగర్, న్యూస్‌టుడే: చంద్రశేఖర్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. గాయకులు కామేశ్వర, మల్లేశ్వర, కుసుమాంజలి తదితరులు తెలుగు చిత్రాల్లోని పాటలను శ్రావ్యంగా ఆలపించారు. చిత్రతారలు చిట్టిబాబు అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు దండు చంద్రశేఖర్, తోట లక్ష్మణరావు, దేవీప్రసాద్, వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ వీడ్కోలు



ఉద్యోగ విరమణ చేసిన అధికారులతో సీపీ రాజశేఖరబాబు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనరేట్‌లో సుదీర్ఘ కాలం పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పోలీసు అధికారులను పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు సోమవారం సత్కరించారు. ఎస్సైలు జి.కృష్ణారావు, ఏఎస్సైలు వి.విఠల్‌రావు, ఎస్.శామ్యూల్, సీనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీదేవీలు ఉద్యోగ విరమణ చేశారు. వీరికి శాలువాలు కప్పి సన్మానించారు. శేషజీవితం ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీపీలు గౌతమిశాలి, కృష్ణమూర్తినాయుడు, ఏఆర్ ఏసీపీ డి.ప్రసాదరావు, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు ఎం.సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

అభిమాన సత్కారం



సినీ నటుడు కార్తీ తన నటనతో తెలుగు ప్రజలకు చేరువయ్యారని తెదేపా పొలిట్‌బ్యూరో నెల్లిబండ్ల బాలస్వామి పేర్కొన్నారు. సత్యం సుందరం విజయోత్సవానికి నగరానికి వచ్చిన కార్తీని బాలస్వామి కలిసి సన్మానించారు. సూర్య కార్తీ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రత్న తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, సూర్యారావుపేట

నవరాత్రుల ముసుగులో కబ్జా?

కాలువ గట్టుపై అక్రమ నిర్మాణం ☛ చోద్యం చూస్తున్న అధికారులు

విజయవాడ, న్యూస్‌టుడే

బుడమేరు వరద నగరవాసులను వణికించి నెల రోజులైంది. నగరంలోని కాలువగట్లపై ఆక్రమణలను పూర్తిగా తొలగిస్తామని స్వయానా సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. ప్రజలకు ఇబ్బందులు రాకూడదనే ఆయన ముందుచూపును.. అధికారులు అపహాస్యం చేస్తున్నారు. కళ్లెదుట కాలువగట్లపై ఆక్రమణలు చోటు చేసుకుంటున్నా.. చూసీచూడనట్లు పోతున్నారు. అక్రమ కట్టడాలపై ఫిర్యాదులు అందినా 'ఔనా... చూస్తాం...' అంటూ మిన్నకుండిపోతున్నారు. ఫలితంగా ఆక్రమణలు పెచ్చుమీరుతున్నాయి. తాజాగా మధురానగర్ కొబ్బరితోట వద్ద గల ఏలూరు కాలువ గట్టు ఆక్రమణలకు గురవుతోంది. దసరా ఉత్సవాల ముసుగులో రాత్రికి రాత్రే గోడలు లేపి గుడి కట్టేస్తున్నారు. పట్టపగలు బరితెగించి నిర్మాణాలు చేపడుతున్నా.. అధికారులకు తెలియకపోవడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్‌బాబుకు సమాచారం ఇచ్చినా.. ఆయన పట్టించుకోకపోవడం గమనార్హం.



కాలువ గట్టుపై తుక్కు వ్యాపారం..

ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే ఫొటోలు పెట్టి...

ఏలూరు కాలువ గట్టుపై ఈ ఏడాది తొలిసారిగా స్థానికులు దేవీ నవరాత్రులకు శ్రీకారం చుట్టారు. దాదాపు 200 గజాల విస్తీర్ణంలో 'ఫ్లెక్సీ'షెడ్ వేశారు. ఇక్కడ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఫొటోలు పెట్టేశారు. అధికార పార్టీ నాయకుల అండదండలున్నాయంటూ నమ్మించే ప్రయత్నం చేస్తూ.. ఆదివారం రాత్రి నుంచి పక్కాగా గుడి కడుతున్నారు. అమ్మవారి విగ్రహం పెట్టేందుకు పీఠం, చుట్టూ గోడలు లేపారు. తెరల చాటున పట్టపగలు పనులు చేస్తున్నారు. పట్టణ ప్రణాళికాధికారులు అసలు ఉన్నారా అని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణంపై అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్‌బాబును వివరణ కోరగా.. సిబ్బందిని పంపి పరిశీలిస్తామని, అక్రమ నిర్మాణం అయితే తొలగిస్తామని చెప్పారు.



నాయకుల చిత్రపటాలతో వెలిసిన షెడ్డు..



తెరల చాటున చేపట్టిన నిర్మాణం

అందరి కళ్లు గట్టు మీదే..

మధురానగర్‌లో ఏలూరు కాలువ గట్టుపై 2009లో ఆక్రమణలు తొలగించారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న దీన్ని.. కొందరు స్థానికులు తుక్కు వ్యాపార కేంద్రంగా మార్చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో.. అధికారులు అసలు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా.. అధికారులు అదే మొద్దు నిద్ర నటిస్తున్నారు. ఆక్రమణలపై జూన్ 23న 'కాలువ గట్టా... డంపింగ్ యార్డా' శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు స్పందించారు. వారం రోజుల్లోగా ఆక్రమణలను తొలగించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఎమ్మెల్యే అయితే మాకేంటి అన్నట్లు వ్యవహరించారు. ఇదే అదునుగా భావించిన కొందరు స్థానికులు.. తాజాగా గుడి పేరుతో కబ్జాకు శ్రీకారం చుట్టారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వివాదాస్పదమవుతోంది.

మహిళలకు చేరువగా కాంగ్రెస్



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న తులసిరెడ్డి, పీటర్ జోసెఫ్, సురేష్, రవికుమార్

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఇందిర అభియాన్ (శక్తి సూపర్ షి) కార్యక్రమం ఏడాది పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కాంగ్రెస్ పార్టీని మహిళలకు చేరువ చేసేందుకు ఇందిర ఫెలోషిప్ పేరిట వినూత్న కార్యక్రమం ప్రారంభించారు. ఆంధ్రరత్నభవన్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ మీడియా కమిటీ ఛైర్మన్ ఎన్.తులసిరెడ్డి చేతుల మీదుగా దీనికి సంబంధించిన గోడపత్రిక ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో మహిళలు, యువతకు పెద్ద పీట వేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్నారు. శక్తి సూపర్ షి కార్యక్రమం రాష్ట్ర ప్రజలకు చేరువైందని, 'ఇందిరా ఫెలోషిప్' కూడా ఆదరణ పొందుతుందన్నారు. ఎన్టీఆర్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పీటర్ జోసెఫ్ మాట్లాడుతూ.. . దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం చక్కని ఆదరణ పొందిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొమ్మినేని సురేష్, బొర్రా రవికుమార్, పి.వై.కిరణ్ కుమార్, గొల్ల పవన్‌కుమార్, అబ్దుల్ రహీం, వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రచనలతో ప్రజాచైతన్యం



నివాళులర్పిస్తున్న విల్సన్, నారాయణరావు, మాల్యాద్రి తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే : ప్రముఖ రచయిత్రి బోయి విజయ భారతి.. జ్యోతిరావు పులే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారని, తన రచనల ద్వారా వారిలో చైతన్యం నింపారని మాజీ ఎమ్మెల్సీ జల్లీ విల్సన్ అన్నారు. సోమవారం సాయంత్రం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విజయభారతి సంతాప సభలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితులు, గిరిజనులపై అత్యాచారాలు, దుర్మార్గాలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటికి వ్యతిరేకంగా పోరాటం చేయడమే.. ఆమెకి ఇచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. గోళ్ల నారాయణరావు అధ్యక్షత వహించారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, జి.నటరాజ్, సి.హెచ్.శ్రీనివాస్, కొండలరావు, పరసా సురేష్, గోసాల మురళీకృష్ణ, రత్నప్రదీప్, జి.రామారావు, పి.రాజు, తిమోతి, లక్ష్మీనారాయణ, రంగారెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా జట్ల ఎంపికలు



ఖోఖోలో పోటీపడుతున్న క్రీడాకారులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : కుందా వారి కండ్రికలోని బీవీ సుబ్బారెడ్డి వీఎంసీ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం నియోజకవర్గ స్థాయి క్రీడా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు. అండర్-14, 17 బాలురకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు దుర్గారావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. నియోజకవర్గం జట్టుకు ఎంపికైన క్రీడాకారులు.. జిల్లా స్థాయిలో మెరుగైన ప్రతిభ చాటాలని కోరారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.నారాయణస్వామి, పలు పాఠశాలల వ్యాయామోపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ జట్టుకు ఎంపికైనవారితో దుర్గారావు, నారాయణస్వామి

ఉత్సవ కళ.. ఘాట్‌లు తళతళ



నీటితో మెట్లు కడుగుతున్న సిబ్బంది



పరిశుభ్రంగా భవానీఘాట్

కృష్ణా నదీ తీరం.. కొత్తరూపు సంతరించుకుంటోంది. ఇటీవల కురిసిన వర్షాలకు కృష్ణమ్మ ఉవ్వెత్తున ప్రవహించడంతో పున్నమి, భవానీ స్నానఘాట్‌లు రూపురేఖలు కోల్పోయాయి. దసరా నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో స్నానఘాట్‌లను అభివృద్ధి చేస్తున్నారు. భక్తుల రాకను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులతో పరిసరాలను శుభ్రం చేయిస్తున్నారు.
- న్యూస్‌టుడే, భవానీపురం



తాత్కాలిక మరుగుదొడ్లు సిద్ధం



జల్లు స్నానానికి ఏర్పాట్లు...

అమ్మో గోతులు..!



నిత్యం వేలాది మంది ప్రయాణికులు, ప్రజలు రాకపోకలు సాగించే విజయవాడ రైల్వేస్టేషన్ రహదారి అధ్వానంగా మారింది. గుంతలు ఏర్పడడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వన్ టౌన్ నుంచి రైల్వేస్టేషన్ మీదుగా అజిత్‌సింగ్‌నగర్, సత్యనారాయణపురం, గాంధీనగర్, హనుమాన్‌పేట తదితర ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి సమయంలోనూ రద్దీగా ఉంటుంది. రైల్వేస్టేషన్ ముఖద్వారం ఆవరణలోని బస్టాపు వద్ద ఎక్కువ సంఖ్యలో గోతులు ఏర్పడ్డాయి. వాహన చోదకులు అదుపుతప్పి కింద పడుతున్నారు. ఇటుగా ఆర్టీసీ బస్సులు, ఆటోలు తిరుగుతుంటాయి. బస్టాపు నుంచి రైల్వే ఎస్పీ కార్యాలయం రోడ్డు, రైల్వే ఆర్ఈ కాలనీ రోడ్డుల్లో ప్రయాణించాలంటే ప్రజలు భయపడుతున్నారు. ఆవరణలో సిగ్నల్స్ ఉన్నా.. వినియోగంలో లేవు. ట్రాఫిక్ సిబ్బంది ఇక్కడ లేకపోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. నగరంలోనే కీలకమైన విజయవాడ రైల్వేస్టేషన్ వద్ద రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉండంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై అనేకసార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదని ప్రజలు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. దసరా పండగ నేపథ్యంలో ప్రయాణికుల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గాంధీనగర్

కార్మికుల సేవలు మరువలేం



మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న కోటేశ్వరరావు, భాస్కరరావు

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : బుడమేరు వరదల్లో పారిశుద్ధ్య కార్మికులు అందించిన సేవలు మరువలేనివని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. సోమవారం అజిత్‌సింగ్‌నగర్ కృష్ణాహోటల్ సెంటరులోని హోచిమెన్‌భవన్ వద్ద పారిశుద్ధ్య కార్మికులకు 58వ డివిజన్ సీపీఐ ఆధ్వర్యంలో చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులు సాధారణస్థితికి తీసుకువచ్చేందుకు కార్మికులు చేసిన సేవలు నిరుపమానమని కొనియాడారు. వారికి ప్రశంసగా ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శులు లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు, కె.వి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే : కండ్రిక సెంటరులో గంజాయి కలిగి ఉన్న ముగ్గురు యువకులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వారి నుంచి కిలో సరకు స్వాధీనం చేసుకున్నారు. అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన గుండాబత్తుల జ్ఞానదీప్ (21), కండ్రికకు చెందిన కల్లా దైవదర్శన్ (22), అయ్యప్పనగర్‌కు చెందిన పొనమాల ధనుష్ (23)లు గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి ఆ ముగ్గురిని పట్టుకున్నారు. విచారణ నిమిత్తం నున్న పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

పుస్తకాల పంపిణీ



పుచ్చలపల్లి సుందరయ్య నగర పాలక సంస్థ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు భౌతిక, రసాయన శాస్త్ర ప్రశ్నావళితో కూడిన పుస్తకాన్ని సోమవారం అందించారు. అన్న సంతర్పణ సేవా సమితి ట్రస్టు అధ్యక్షుడు దిలీప్ పంపిణీ చేశారు. మొత్తం 160 మందికి జిల్లా సైన్సు అధికారి మైనం హుస్సేన్ చేతుల మీదుగా అందించారు. సునంద, రాధిక, రేణుకాదేవి, సత్యవతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, పాయకాపురం (మధురానగర్)

బేసిక్ లైఫ్ సపోర్టుపై శిక్షణ



మహిళకు బీఎల్ఎస్ శిక్షణ ఇస్తున్న వైద్యురాలు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఆయుష్ హాస్పిటల్‌లో ప్రజలకు బేసిక్ లైఫ్ సపోర్టు(బీఎల్ఎస్)పై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్, గుండె వైద్య నిపుణుడు డాక్టర్ కె.గోపాలకృష్ణ, డైరెక్టర్ కె.శ్రీనివాససాయి నేతృత్వంలో శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఆస్పత్రి కమిటీ ఛైర్మన్ డాక్టర్ వై.రమేష్‌బాబు మాట్లాడుతూ.. ప్రమాదంలో ఉన్న ప్రతిఒక్కరినీ రక్షించే బాధ్యత చుట్టుపక్కల వారికి ఉంటుందని అన్నారు. ఆస్పత్రి హృద్రోగ విభాగాధిపతి డాక్టర్ పి.ఎస్.శ్రీనివాస చౌదరి మాట్లాడుతూ.. బీఎల్ఎస్ శిక్షణ తీసుకుంటే గుండెపోటు వచ్చిన వారికి సీపీఆర్ చేసి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడవచ్చని వివరించారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.ఎల్.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టర్ తరుణ్ చౌదరి, డాక్టర్ పావని శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణకు వచ్చిన వారికి ఆయుష్ స్వాస్థ్య యాప్‌పై అవగాహన కల్పించారు. సీఏవో ఎం.జయలక్ష్మి పర్యవేక్షించగా, 250 మందికి శిక్షణ ఇచ్చారు.

ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలి

గాంధీనగర్, న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించాలనే ఆలోచనను విరమించుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు కోరారు. సోమవారం దాసరి భవన్‌లో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. లాభాల్లో ఉన్న కర్మాగారాన్ని ఎలా ప్రైవేటీకరిస్తారని ప్రశ్నించారు. ఉక్కు పరిరక్షణ కోసం అన్ని వర్గాల ప్రజల్ని ఐక్యం చేసి పోరాటాలను ఉద్ధృతం చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలపై రాష్ట్రంలోని భాజపా నాయకులు ప్రధాని మోదీని ప్రశ్నించకపోవడం విచారకరమన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దోనెపూడి శంకర్ మాట్లాడుతూ.. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మంగళవారం (నేటి) నుంచి యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సమాఖ్య జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజులు, షేక్ సుభానీ, కంచర్ల భార్గవ్, లంకే సాయి, మన్నే హనుమంతరావు, శింగంశెట్టి మోహన్‌ప్రసాద్, శిరం రవి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభల జయప్రదానికి పిలుపు



కరపత్రాలు విడుదల చేస్తున్న రాజమోహన్, వెంకటరెడ్డి, అరుణ్‌కుమార్, వేణుగోపాల్

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : డిసెంబరు 14, 15 తేదీల్లో నిర్వహించే భారత ఐక్య విద్యార్థి సమాఖ్య(యూఎస్ఎఫ్ఐ) జాతీయ మహా సభలను జయప్రదం చేయాలని ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షుడు కొల్లా రామమోహన్ పిలుపునిచ్చారు. సోమవారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో కార్యక్రమ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విధానాలతో విద్య రోజురోజుకూ ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తోందన్నారు. విద్యారంగంలో వస్తున్న మార్పులపై భవిష్యత్తు కార్యాచరణ రూపొందించాలని కోరారు. విద్యాహక్కు చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని, కొఠారి కమిషన్ ప్రకారం ఎక్కువ నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. యూఎస్ఎఫ్ఐ జాతీయ కన్వీనర్ మాదం తిరుపతి మాట్లాడుతూ.. సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు ఉన్న బకాయిలను విడుదల చేయాలని, విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న రెగ్యులర్ వీసీలను భర్తీ చేయాలని కోరారు. నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటరెడ్డి, మాడిశెట్టి అరుణ్‌కుమార్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విపత్తు సాయం రూ.7,600 కోట్లు విడుదల చేయండి

కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి


విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : కృష్ణా నది, బుడమేరు వరదల్లో విజయవాడ నగరానికి తీవ్రమైన నష్టం వాటిల్లి నెల రోజులైందని.. మోదీ ప్రభుత్వం జాతీయ విపత్తు నిధి నుంచి ఒక్క రూపాయైనా విడుదల చేయకపోవడం శోచనీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన విజయవాడలో విలేకర్లతో మాట్లాడారు. వరదల్లో రూ.7,600 కోట్ల నష్టం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం నివేదిక పంపిందని గుర్తు చేశారు. 74 మంది మృతి చెందారని, 5 లక్షల ఎకరాల్లో పంట నష్టం, వేలాది కిలోమీటర్ల మేర రోడ్లు నాశనమయ్యాయని వివరించారు. కేంద్ర వ్యవసాయశాఖా మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, కేంద్ర అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారని చెప్పారు. జాతీయ విపత్తు కింద రూ.7,600 కోట్లు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు మాట్లాడుతూ.. 18వ రాజ్యాంగ సవరణ చేసి దేశమంతటా ఒకేసారి ఎన్నికలు జరపాలని నిర్ణయించడం తుగ్లక్ నిర్ణయమని విమర్శించారు. ఇది ఆచరణ సాధ్యం కాదని, క్రమంగా ఇది నియంతృత్వానికి దారితీస్తుందన్నారు. సమాఖ్య వ్యవస్థకు విఘాతమన్నారు. ఎన్నికల ఖర్చు తగ్గుతుందని, అభివృద్ధి పరుగులు తీస్తుందనడం అవివేకమని విమర్శించారు. అమెరికాలోనూ జమిలీ ఎన్నికలు లేవని గుర్తు చేశారు. మోదీ వ్యవహారం.. పండగలన్నీ ఒకే రోజు జరిపితే సరిపోతుంది కదా అన్నట్లుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ సవరణ చేయాలంటే మూడింట రెండు వంతుల మెజార్టీ రావాలని పేర్కొన్నారు. లోక్‌సభలో ఎన్డీయేకు 69 సీట్లు, రాజ్యసభలో 43 సీట్లు తక్కువగా ఉన్నాయని చెప్పారు. రాజ్యాంగ సవరణ ద్వారా జమిలి ఎన్నికలు అసాధ్యమని, దీన్ని మోదీ విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మురుగు ఉప్పొంగి..



మాచవరం డౌన్‌లో ఏలూరు రోడ్డుపై..

మాచవరం డౌన్ నుంచి దాసాంజనేయస్వామి దేవస్థానానికి వెళ్లే దారిలో ఏలూరు రోడ్డుపై రెండు చోట్ల భూగర్భ డ్రైనేజీ పొంగుతోంది. ఆ నీరు రోడ్డుపై నిలుస్తోంది. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. దుర్వాసన వెదజల్లుతోంది. సంబంధిత అధికారులు స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, మాచవరం


ముఖ్యమంత్రి చంద్రబాబుకు విరాళం అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఈవో, ఎండీ మణిమేఖలై, ఆ బ్యాంకు అధికారులు ★ సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్, టెక్నికల్ ఎడ్యుకేషన్ అధ్యక్షుడు డాక్టర్ సి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు రాజయ్య, కార్యదర్శి పి.లక్ష్మణరావు ★ ఆర్జా స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ శ్రీధర్ కృష్ణమూర్తి. చిత్రంలో బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ తదితరులు

వరద బాధితులకు అండ

• సీఎం సహాయనిధికి పలువురు విరాళాలు

ఈనాడు డిజిటల్, అమరావతి, న్యూస్‌టుడే యంత్రాంగం: ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు పలువురు వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు వరద బాధితుల్ని ఆదుకోవడానికి ముందుకొస్తున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్‌)కి విరాళాలు అందిస్తున్నారు. సోమవారం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లను పలువురు కలిసి విరాళాల చెక్కుల్ని అందజేశారు.

యూనియన్ బ్యాంకు ఉద్యోగుల ఒకరోజు వేతనం

వరద బాధితుల సహాయార్థం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు తమ ఒకరోజు వేతనం రూ.5,90,01,087ను విరాళంగా ప్రకటించారు. ఇందుకు సంబంధించిన చెక్కును సీఈవో, ఎండీ ఎ.మణిమేఖలై సీఎం చంద్రబాబుకు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు ప్రతినిధులు ఎస్.రామసుబ్రహ్మణియన్, సీవీఎన్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

✦ సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్, టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సి.నాగేశ్వరావు, వైస్ ప్రెసిడెంట్ ఎం.రాజయ్య, కార్యదర్శి పి.లక్ష్మణరావు రూ. కోటి విరాళం ప్రకటించారు. ఈ మేరకు చెక్కును చంద్రబాబుకు అందజేశారు.

✦ ఆర్జా స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ శ్రీధర్‌కృష్ణమూర్తి రూ.కోటి అందజేశారు. విరాళానికి సంబంధించిన చెక్కును ముఖ్యమంత్రికి ఇచ్చారు.

✦ కేరళకు చెందిన పెన్వార్ ప్రాడక్ట్స్ లిమిటెడ్ ఎండీ ఫిలిప్స్ థామస్ రూ.50 లక్షల చెక్కును మంత్రి లోకేశ్‌కు ఇచ్చారు.

✦ విజయవాడకు చెందిన ఇండిపెండెంట్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (ఐసీఎంఏ) ప్రతినిధులు రూ.50 లక్షల విరాళం ఇచ్చారు. ఈ మేరకు చెక్కును మంత్రి లోకేశ్‌కు అందజేశారు.

✦ బెంగళూరుకు చెందిన తెలుగు విజ్ఞాన సమితి ప్రతినిధులు ఎ.రాధాకృష్ణరాజు, ఆర్.ఆదికేశవులునాయుడు రూ.25 లక్షల చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేశారు.

✦ శశి విద్యా సంస్థల విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ.25 లక్షల విరాళమిచ్చారు. ఈ మేరకు మంత్రి లోకేశ్‌కు చెక్కు అందజేశారు. ఆ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ మాట్లాడుతూ తమ విద్యాసంస్థల తరఫున గతంలో రూ. కోటి విరాళం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు, విద్యార్థుల సహకారంతో మరో రూ.25 లక్షలు అందించడం సంతోషకరమన్నారు.





మంత్రి లోకేశ్‌కు విరాళం అందజేస్తున్న పెన్వార్ ప్రాడక్ట్స్ లిమిటెడ్ ఎండీ ఫిలిప్స్ థామస్ తదితరులు ★ శశివిద్యా సంస్థల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ తదితరులు

వ్యక్తి/సంస్థ	సాయం (రూ.లలో)
అసోసియేషన్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా	10 లక్షలు
ఎం.అప్పారావు	10 లక్షలు
చిన్మయ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్	10 లక్షలు

✦ అనంతపురానికి చెందిన కేఎం షకిల్ షఫి నేతృత్వంలో ఏపీ వక్ఫ్ ఇన్‌స్టిట్యూషన్స్, ముతావల్లీస్ అండ్ మేనేజింగ్ కమిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.7.86 లక్షల విరాళం అందించారు.

✦ జంపాల భావనారాయణ, శారద అనే వృద్ధులు రూ.లక్ష చెక్కు, 16 గ్రాముల బంగారు బ్రేస్‌లెట్‌ని వరద బాధితులకు విరాళంగా ముఖ్యమంత్రికి అందజేసి తమ ఉదారత చాటుకున్నారు.

✦ తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం అచ్చెన్నపాలెంకు చెందిన పాతూరి కేతన్‌చౌదరి అనే బాలుడు తన కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.10 వేల విరాళాన్ని సీఎంకు అందజేశాడు.



ముఖ్యమంత్రికి విరాళం ఇస్తున్న బెంగళూరుకు చెందిన తెలుగు విజ్ఞాన సమితి ప్రతినిధులు ఎ.రాధాకృష్ణరాజు, ఆర్.ఆదికేశవులునాయుడు తదితరులు



ముఖ్యమంత్రికి విరాళం చెక్కు, 16 గ్రాముల బంగారం అందిస్తున్న వృద్ధులు జంపాల భావనారాయణ, శారద. చిత్రంలో మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి



ఎగువ, దిగువ కాఫర్‌డ్యాం మధ్య నీటిని ఎత్తిపోసేందుకు ఏర్పాటు చేసిన పంపులు

పోలవరానికి తగ్గిన వరద

డయాఫ్రంవాల్ నిర్మాణ ప్రాంతంలో నీరు ఎత్తిపోతకు చర్యలు

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన డయాఫ్రంవాల్ నిర్మాణం నవంబరు నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. గోదావరిలో వరద ఉద్ధృతి తగ్గడంతో ప్రధాన డ్యాం ప్రాంతంలోని నీటిని పంపుల ద్వారా బయటకు ఎత్తిపోస్తుండగా.. తాజాగా మరిన్ని పంపులు ఏర్పాటు చేసే పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. దిగువ కాఫర్‌డ్యాం వద్ద సోమవారం నాటికి గుత్తేదారు సంస్థ 23 పంపులు ఏర్పాటు చేసి, నీటిని గోదావరిలోకి మళ్లిస్తున్నారు. సుమారు వంద పంపులు ఏర్పాటు చేయాలని నెల రోజుల కిందటే జలవనరుల శాఖాధికారులు గుత్తేదారు సంస్థకు ప్రణాళిక అందజేశారు. మొన్నటి వరకు రెండు కాఫర్‌డ్యాంల మధ్యనున్న నీరు డీప్లింటింగ్ స్లూయిస్ నుంచి నదిలోకి వెళ్లేది. స్లూయిస్ నుంచి నీరు ఆశించిన మేర బయటకు వెళ్లకపోవడంతో పంపులు ద్వారా తోడేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ నెలలో విదేశీ నిపుణుల బృందం మరోసారి ప్రాజెక్టు సందర్శనకు రానుంది. ఈలోపు నీరంతా తోడించి, వారు సమగ్రంగా డయాఫ్రంవాల్ ప్రదేశాన్ని చూసేలా సర్వం సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఎమ్మెల్యే కొలికపూడిని సస్పెండ్ చేయాలి

ప్రధాన రహదారిపై మహిళల నిరసన



తిరువూరు మండలం చిట్టేలలో నినాదాలు చేస్తున్న మహిళలు

తిరువూరు, న్యూస్‌టుడే: మహిళా ఉద్యోగుల వాట్సాప్ నంబర్లకు అసభ్యకరంగా సందేశాలు పంపిస్తూ లైంగికంగా వేధిస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును తెదేపా అధిష్ఠానం సస్పెండ్ చేయాలని మహిళలు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలంలోని చిట్టేలలో సోమవారం మహిళలు ప్రధాన రహదారిపై నిరసన ప్రదర్శన నిర్వహించారు. మహిళల పట్ల ఎమ్మెల్యే చేసిన అనుచిత వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయని మండిపడ్డారు. ఎమ్మెల్యే నుంచి రక్షణ కల్పించాలని కోరారు. కొలికపూడిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమం తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

నిజం నిగ్గు తేల్చాలంటున్న ఎమ్మెల్యే: తనపై చేసిన ఆరోపణలు నిజమైతే అరెస్టు చేసి శిక్షించాలని, లేని పక్షంలో ఆరోపణలు చేసిన వారిని శిక్షించాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమవారం రాత్రి నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై ఆరోపణలు చేస్తున్న మహిళ ఇప్పటివరకు నాలుగుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించారని, ఆమె భర్తపై పోలీసులు ఎప్పుడు కేసు పెట్టినా ఇలాంటి ఆత్మహత్య నాటకం ఆడుతారని ఆరోపించారు. తనపై పథకం ప్రకారం చేస్తున్న అసత్య ప్రచారాన్ని నియోజకవర్గ ప్రజలు నమ్మబోరని అన్నారు. అధిష్ఠానం ఆదేశాలతో తన దీక్షను విరమిస్తున్నానని ప్రకటించారు.

‘జగనన్న తోడు’ పథకం పేరు మార్పు

ఈనాడు, అమరావతి: చిరు వ్యాపారుల కోసం ప్రవేశపెట్టిన ‘జగనన్న తోడు’ పథకం పేరును కూటమి ప్రభుత్వం మార్చింది. ఆ పథకానికి ‘చిరు వ్యాపారులకు సున్నా వడ్డీ రుణాలు’గా పేరు పెట్టింది. జగనన్న తోడు పథకం పేరు మార్పు కోసం గ్రామ, వార్డు సచివాలయాల శాఖ నుంచి వచ్చిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

నిర్మలా సీతారామన్ మీద విచారణపై కర్ణాటక హైకోర్టు స్టే

ఈనాడు, బెంగళూరు: ఎన్నికల బాండ్ల సేకరణలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మీద విచారణపై కర్ణాటక హైకోర్టు స్టే విధించింది. తదుపరి విచారణను అక్టోబరు 22వ తేదీకి వాయిదా వేసింది. సోమవారం జస్టిస్ ఎం.నాగప్రసన్న నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు ఇస్తూ .. ప్రతివాదుల నుంచి అభ్యంతరాలు దాఖలయ్యేంత వరకు ప్రాథమిక విచారణ చేపట్టటం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. తదుపరి విచారణ వరకు ఈ



స్టే అమలులో ఉంటుందన్నారు. ఐపీసీ సెక్షన్లలో బాధితులకు రక్షణ కల్పించే విధానాలున్నాయని, ఈ కేసులో ఫిర్యాదుదారుడు ఎలాంటి బాధితుడూ కాదని వివరించారు. కేవలం ఈ ఫిర్యాదు ద్వారా ఐపీసీ సెక్షన్ 383 వినియోగం గురించి వెల్లడించాలన్న అభిప్రాయంతో ఉన్నారని పేర్కొన్నారు. ఈ కేసులో మరో నిందితుడు, భాజపా కర్ణాటక శాఖ పూర్వ అధ్యక్షుడు నళిన్ కుమార్ కటీల్..తనపై కేసు నమోదు చేయవద్దంటూ వేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి విచారణ చేపట్టారు. జనాధికార సంఘ్ పరిషత్ సహాధ్యక్షుడు ఆదర్శ్ అయ్యర్ చేసిన ఫిర్యాదు మేరకు గత శుక్రవారం ప్రత్యేక కోర్టు విచారణకు ఆదేశించింది. శనివారం బెంగళూరులోని తిలక్‌నగర్ పోలీసులు నిర్మలా సీతారామన్‌తో పాటు భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర తదితరులపై కేసు నమోదు చేశారు.

అతిథులొస్తున్నారు..!

✦ నగరంలో నవరాత్రులు..

✦ బస్‌స్టేషన్లో వసతులపై దృష్టి అవసరం

విజయవాడ బస్టేషన్, న్యూస్‌టుడే

దేశంలో అతి పెద్ద బస్‌స్టేషన్లలో విజయవాడ ఒకటి. నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రయాణికులతో కిటికిటలాడుతుంది. ఒకవైపు వచ్చే బస్సులు వస్తుంటే.. మరోవైపు వెళుతూనే ఉంటాయి. పండగలు పబ్బాలు, సెలవులు వచ్చాయంటే.. రాకపోకలు రెట్టింపవుతాయి. దసరా ఉత్సవాల నేపథ్యంలో నగరానికి వచ్చే భక్తులకు బస్‌స్టేషన్‌లో వసతులు మెరుగుపరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రోజూ వారీ బస్సులు :	మూడు వేలు
ప్రయాణికులు :	1.50 లక్షల మంది
పండగ వేళ :	సుమారు 40వేలు (అదనం)



వినోదానికి తెర

బస్టేషన్‌లోని సమాచార కేంద్రం ఎదురుగా బిగ్ స్క్రీన్ (తెర) ఏర్పాటు చేశారు. సినిమాలు, పాటలు, క్రికెట్ మ్యాచ్‌లు ప్రసారం చేసేవారు. వేచి ఉండే ప్రయాణికులకు వినోదం లభించేది. ప్రస్తుతం ఇది మరమ్మతులకు గురైంది. దీనిని అందుబాటులోకి తీసుకొస్తే.. నవరాత్రులకు వచ్చే వారికి ప్రయోజనకరంగా ఉంటుంది.



పని చేయని బిగ్ స్క్రీన్

పోలీస్ పర్యవేక్షణ పెరగాలి

సాధారణంగానే బస్‌స్టేషన్‌లో జేబు దొంగలు తిరుగుతున్నారు. దసరా నేపథ్యంలో వారు చేతివాటం చూపే అవకాశాలు లేకపోలేదు. రైల్వే గేటు నుంచి బ్లేడ్ బ్యాచ్ వస్తోంది. పోలీసులు సైతం పట్టించుకోవడం మానేశారు. ఇప్పుడైనా నిఘా పెంచి దుండగుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి.

నిర్వహణ మరిచి..

బస్‌స్టేషన్‌లోని ఇన్‌గేట్ వైపు, అరైవల్ బ్లాక్‌వైపు, డిపార్చర్ బ్లాక్ ఎదురుగా, సిటీ బస్‌పోర్ట్‌లో ఉచిత మూత్రశాలలు ఉన్నాయి. వీటి నిర్వహణను గాలికొదిలేశారు. అరైవల్‌బ్లాక్ వద్ద రేకులు కూలిపోయాయి. పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. దుర్వాసన వెదజల్లుతోంది. మిగిలిన నాలుగు మూత్రశాలల్లో అసలు సింక్‌లు లేవు. నీరు పడకుండా పైపులకు మధ్యం సీసాలు అడ్డుగా పెట్టారు. వీటికి మరమ్మతులు చేయాలి.



అరైవల్ బ్లాక్‌కు ఎదురుగా అధ్వానంగా ఉచిత మూత్రశాల

మరమ్మతులు చేయిస్తే..



కుర్చీలు పడేశారు

లక్షలాది మంది ప్రయాణికులు కూర్చోవడానికి ప్రాంగణంలో కుర్చీలు ఏర్పాటు చేశారు. ఎయిర్ పోర్ట్ తరహాలో ఉండాలనే ఉద్దేశంతో.. అప్పట్లో ఒక్కోటి సుమారు రూ.5వేలు విలువైన కుర్చీలను తెప్పించారు. కొన్నాళ్లు వినియోగించారు. చిన్న చిన్న సమస్యలు రావడంతో.. వాటిని పక్కన పడేశారు. వీటికి మరమ్మతులు చేయిస్తే.. వాడుకోవచ్చు. అవసరాలు తీరతాయి.

ప్రీపెయిడ్ బూత్ ఖాళీ



సుదూరప్రాంతాల నుంచి నగరానికి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రీపెడ్ బూత్ ఏర్పాటు చేశారు. ఆటోకు నిర్ణీత రుసుం చెల్లించి గమ్యస్థానాలకు వెళ్లవచ్చు. దీనికోసం ప్రత్యేక సిబ్బందిని నియమించారు. వారి వద్ద టోకెన్లు తీసుకుని, సేవలను సద్వినియోగం చేసుకోవచ్చు. ప్రస్తుతం ఈ ప్రీపెడ్ బూత్ పనిచేయడం లేదు. ఖాళీగా దర్శనమిస్తోంది.

దుర్గగుడి హుండీ ఆదాయం రూ. 2.05 కోట్లు

ఇంద్రకీలాద్రి: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను మల్లికార్జున మహా మండపం ఆరో అంతస్తులో సోమవారం లెక్కించారు. 18 రోజుల్లో వచ్చిన కానుకలను లెక్కించగా రూ.2,05,75,873 ఆదాయం వచ్చింది. భక్తులు ఇవే కాకుండా 266 గ్రాముల బంగారం, 5.562 కిలోల వెండి వస్తువులను మొక్కుల రూపంలో చెల్లించారు. వీటితో పాటు 568 యూఎస్‌ఏ డాలర్లు, 185 యూఏఈ దీర్హామ్స్, 2500 నైజీరియా నైరాలు, 20 ఇంగ్లాండ్ పౌండ్స్, 40 కెనడా డాలర్లు వచ్చినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. కానుకల లెక్కింపును డిప్యూటీ ఈవో రత్నరాజు పర్యవేక్షించారు. దుర్గమ్మను నేరుగా దర్శించుకోలేని భక్తులు ఆన్‌లైన్లో ఈ- హుండీ ద్వారా రూ.75,396 సమర్పించారు.



పర్యవేక్షిస్తున్న డిప్యూటీ ఈవో రత్నరాజు

జయప్రకాశ్‌కు ప్రజల్లో శాశ్వత స్థానం

బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ప్రజాప్రతినిధిగా, రాజకీయ విశ్లేషకుడిగా అడుసుమిల్లి జయప్రకాశ్ ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోతారని మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. మాజీ ఎమ్మెల్యే అడుసుమిల్లి జయప్రకాశ్ సంస్మరణ సభని ఎంజీ రోడ్డులోని శేషసాయి కల్యాణ వేదికలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ... విజయవాడ ప్రత్యక్ష రాజకీయాల్లో జయప్రకాశ్ ప్రముఖ పాత్ర పోషించారని గుర్తు చేశారు. నమ్మిన సిద్ధాంతం కోసం వెనకడుగు వేయకుండా పోరాటం చేశారని పేర్కొన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ.. ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకున్నా.. పరోక్ష రాజకీయాల్లో జయప్రకాశ్ క్రియాశీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ... తాము స్నేహపూర్వకంగా ఉండేవాళ్లమని గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, మండలి బుద్ధప్రసాద్, కామినేని శ్రీనివాస్, వెనిగళ్ల రాము, మాజీ ఎంపీలు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, కేవీపీ రామచంద్రరావు, వడ్డే శోభనాద్రీశ్వరరావు, లగడపాటి రాజగోపాల్, మాజీ ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, జయప్రకాశ్ కుమారుడు అడుసుమిల్లి శ్రీతిరుమలేష్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న వెంకయ్యనాయుడు, లక్ష్మీప్రసాద్, శ్రీతిరుమలేష్, శ్రీనివాస్

అర్హులందరినీ ఓటరుగా నమోదు చేయాలి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈసీ మార్గదర్శకాల ప్రకారం అర్హులందరినీ ఓటరుగా నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉమ్మడి కృష్ణా, గుంటూరు డీఆర్వోలు, ఆర్డీవోలు, తహసీల్దార్లతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు పదవీకాలం 2025, మార్చి 29తో ముగుస్తుందని, ఈ నేపథ్యంలో ఎన్నికలకు ఓటరు జాబితా రూపకల్పనకు నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఓటరుగా నమోదుకు నవంబరు 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని, డిసెంబర్ 9 వరకు అభ్యంతరాల స్వీకరించి, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తారన్నారు. గతంలో ఓటరు జాబితాను ప్రస్తుతం పరిగణనలోకి తీసుకోరని, అందువల్ల ప్రతి ఒక్కరూ నూతనంగా ఓటుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అర్హతలివీ.. 2021 నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు ఓటరుగా నమోదుకు అర్హులని, సాధారణ డిగ్రీతో పాటు ఇంటర్ తర్వాత డిప్లొమా చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో సాధారణ నివాసై దేశంలో ఎక్కడైనా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు ఫారం 18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్లలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వీలుందన్నారు. వచ్చిన దరఖాస్తులను ఏఈఆర్వోలు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి అందించాలన్నారు. ఫారం-18 దరఖాస్తులు 1.50 లక్షలు ముద్రించామని, వీటని ఏఈఆర్వోలకు అందించామన్నారు. ఒకే కుటుంబానికి సంబంధించినవి, ఒకే సంస్థలో పనిచేసే వారికి సంబంధించిన దరఖాస్తులు మాత్రమే ఒకేసారి తీసుకునేందుకు అనుమతించాలన్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2.50 లక్షల మంది ఓటర్లుగా నమోదయ్యారని, ప్రస్తుతం 3.50 లక్షల మందిని నమోదు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. వీసీలో డీఆర్వో పి.రోజా, కలెక్టరేట్ ఎన్నికల విభాగ పర్యవేక్షకుడు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీకి ధర్నా

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : కానిస్టేబుళ్ల భర్తీ ప్రక్రియ పూర్తి చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న డిమాండ్ చేశారు. ఈ విషయమై డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నాచౌక్‌లో మోకాళ్లపై కూర్చొని వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండేళ్ల కిందట 6 వేల కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారని చెప్పారు. ప్రాథమిక రాత పరీక్షలో 95,208 మంది అభ్యర్థులు అర్హత సాధించారని తెలిపారు. దేహదారుఢ్య, మెయిన్స్ పరీక్షలు ఇప్పటి వరకు నిర్వహించలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం హోంగార్డు రిజర్వేషన్లు సివిల్ నుంచి 8 నుంచి 15శాతం, ఏపీఎస్పీ 15 నుంచి 24శాతానికి పెంచడం వల్ల నిరుద్యోగులకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. భవిష్యత్తులో యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా చేసేందుకే ఇలా చేశారని మండిపడ్డారు. దీనిపై హోంగార్డులు హైకోర్టును ఆశ్రయించగా.. వారికి అనుకూలంగా తీర్పు వచ్చిందని చెప్పారు. సుప్రీం కోర్టులో అప్పీలు చేయగా.. గత ప్రభుత్వం పట్టించుకోలేదని, అభ్యర్థులు పూర్తిగా నష్టపోయారని వివరించారు. కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని అభ్యర్థులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. యువగళం పాదయాత్రలో మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని నాయకులు.. తెదేపా కేంద్ర కార్యాలయంలోని మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు నాగేశ్వరరావు, కృష్ణ, నాగార్జున, కిరణ్, శ్రీను నాయక్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.



డీవైఎఫ్ఐ నాయకులు, అభ్యర్థుల నిరసన

ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

గాంధీనగర్, న్యూస్‌టుడే : వివిధ ప్రభుత్వ శాఖలు, పరిశ్రమల్లో పని చేస్తున్న ఒప్పంద, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ధర్నా చౌక్‌లో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల్లో పని చేసే ఒప్పంద కార్మికులకు కనీస వేతనాలు, పని గంటలు, సెలవులు, ఇతర సౌకర్యాలు అమలు కావడం లేదని ఆరోపించారు. సంబంధిత గుత్తేదారులు వారిని దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో విద్యుత్తు, ఆర్టీసీతో సహా ఔట్‌సోర్సింగ్ విధానంలో లక్షలాది మంది పని చేస్తున్నారని తెలిపారు. ఈ రంగాలను రెగ్యులరైజ్ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పరిశ్రమల్లో తనిఖీలు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.ఆర్.కె.మూర్తి, కె.ఉమామహేశ్వరరావు, ఆర్.వి.నరసింహారావు, ఎ.వెంకటేశ్వరరావు, ఎ.కమల, ఎం.మహేష్, సి.హెచ్.సుధాకర్, ఇ.వి.నారాయణ, కె.దుర్గారావు, ఎం.సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకులు

కృష్ణా జిల్లా విద్యుత్తు సర్కిల్ ఎస్ఈగా సత్యానందం

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : కృష్ణా జిల్లా విద్యుత్తు సర్కిల్ తొలి ఎస్ఈగా ఎం.సత్యానందంను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు విజయవాడ సర్కిల్ పేరుతో ఉమ్మడి కృష్ణా జిల్లాకు ఎ.మురళీమోహన్ ఎస్ఈగా ఉన్నారు. ఇటీవల జరిగిన మార్పుల్లో భాగంగా విజయవాడ సర్కిల్‌ను కృష్ణా జిల్లా, ఎన్టీఆర్ జిల్లాలుగా విభజించారు. ఎన్టీఆర్ జిల్లాకు ఎ.మురళీమోహన్‌ను ఎస్ఈగా యథాస్థానంలో ఉంచారు. కొత్తగా ఏర్పడిన కృష్ణాజిల్లా సర్కిల్‌కు ఎస్ఈగా స్కాడా జీఎంగా పనిచేస్తున్న ఎం.సత్యానందం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం సాయంత్రం విజయవాడలోని సీఎండీ కార్యాలయంలో సత్యానందం సదరు ఉత్తర్వులు అందుకున్నారు. సీనియర్ అసిస్టెంట్ గుడేటి దీపక్.. ఆయన్ని అభినందించారు.



సత్యానందంను అభినందిస్తున్న దీపక్